# మంత్రమెక్కడుంది! తంత్రమెక్కడుంది!

(భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి)

# శ్రీ మాధవదాసు గారి దివ్య చరిత్ర













ప్రథమ ముద్రణ : 2006



ప్రతులకు వ్రాయండి:-
శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్టు,
గొలగమూడి,
నెల్లూరు జిల్లా **524 321**

# భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి వారు ఆచరణతో బోధించిన బోధయే ఈ గ్రంథము

"మంత్రమెక్కడుంది తంత్రమెక్కడుంది చూచుకుంటూ పొయ్యేదే గదయ్యా" అన్నారు శ్రీ స్వామి వారు. ఆమాట అక్షరాల నిజమని నిరూపిస్తుంది ఆ మహనీయుని జీవిత చరిత్ర. చివరిగా శ్రీ మాధవదాసు చరిత్ర చదివించుకొని విని శ్రీ స్వామి వారు శరీరం వదిలారు.

శ్రీ మాధవదాసు గారి చరిత్రలో వారికి గురువు నుండి మంత్రోపదేశం లభించక ముందే వారికి మహా అద్భుత శక్తులు లభించాయి.

**1.** విస్తర దొన్నెవలె చేసి కట్టెల పొయ్యిపై అన్నం వండడం.

**2.** హంసలు గొడుగువలె వారికి నీడబట్టి నీరు చూపించడం.

**3.** నాలుక లేని గంటలు మ్రోగడం.

**4.** మంత్ర జపం చేయక ముందే పుష్పక విమానంలో శ్రీహరిని చేరడం.

ఇట్టి గొప్ప స్థితిని వారికి ప్రసాదించినది మంత్రసిద్ధి కాదు. ఆత్మ శుద్ధి మాత్రమే.

యదా సర్వేప్రముత్యంతే కామాయేస్యహృదిశ్రితాః
అద మర్త్యో అమృతో భవతి అత్ర బ్రహ్మ సమస్నుతే

హృదయము నుండి కామములన్నీ పూర్తిగా లేకుండా పోయిన మరుక్షణం ఆ జీవి అమరత్వము పొందును. ఈ శ్లోకమునకు సజీవమైన ఉదాహరణే శ్రీ మాధవదాసు గారి కథ, శ్రీ వెంకయ్య స్వామి వారి జీవిత చరిత్ర మరియు బుద్ధుని చరిత్ర. ఏ మంత్రము గొప్పదనే మీమాంసగల మనందరికీ గొప్ప పాఠము ఇది. అదే శ్రీ సాయినాథుని బోధ యొక్క సారాంశము. మంత్ర సాధన కంటే అంతఃశుద్ధి, గురుసేవ సాధించమని మానవాళికి బోధించే గొప్ప బోధ ఇది.



ఓం శ్రీ గురుభ్యో నమః

## ముందు మాట

శ్రీ మాధవదాసు గారి దివ్య చరిత్ర శ్రీ వ్యాస మహర్షి శిష్యుడైన శ్రీ జైమిని యను మహాత్మునిచే వ్రాయబడినది. శ్రీ వ్యాస మహర్షి గారు ఈ గ్రంథమును గురు దక్షిణగా శ్రీ జైమిని గారి నుండి గ్రహించారు. దైవ యోగమున కొన్ని పత్రములు లుప్తమై మిగిలినవి శ్రీ ఉలూచి యను మహనీయునికి లభ్యమైనవి. ఆ మహనీయుడు లుప్తమైన భాగములను పూరించి వ్రాశారని తెలియుచున్నది.

ఈ గ్రంథము ద్వారా నిజమైన ముముక్షువు ఎలా వుంటాడు అనేది మనకు బాగా తెలుస్తుంది. భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి వారు మానవాళికి బోధించిన పంచ సూత్రాలు **1**) సత్యం, **2**) ధర్మం, **3**) సంపన్నత్వం, **4**)సాధారణత్వం, **5**) సద్గురు సేవలు శ్రీ మాధవదాసు గారి జీవితంలో మనకు చక్కగా కనిపిస్తాయి.

పూజ్యపాదులు ఆచార్య శ్రీ భరద్వాజ మాష్టరు గారు మను ధర్మశాస్త్రము నుండి క్రోడీకరించినట్లు ఋణానుబంధాలు, మన మిచ్చిన వాగ్దానాలు, చేసిన ప్రమాణాలు, మన బాధ్యతలు పూర్తిగాకుండా బ్రహ్మానుభూతి వీలుకాదని ఈ కథ ద్వారా మనకు చక్కగా బోధ పడుతుంది. సద్గురు కృపతో సాధన చేసి మనలోని మాలిన్యాన్ని పోగొట్టుకునే ప్రయత్నమొక్కటే జీవిత ధ్యేయం కావాలి. అప్పుడు క్రొత్త బంధాలు తగులుకోకుండా మనవైపు నుండి జాగ్రత్త పడడమనే ఒక్క అడుగు మనం వేస్తే కరుణా నిధియైన సద్గురు కృప పది రెట్లుగా మనకు లభ్యమై గమ్యం చేర్చుతుంది.

శ్రీ మాధవదాసు గారి గురువుగారు ఎంత గొప్పవారో వ్రాయతరము గాదు.

వారి దివ్యాత్మను తీసుకపోను పుష్పకవిమానముతో దేవదూతలు వస్తారు. దేవతలు వారికి స్వాగతం పలుకుతారు. శ్రీమహావిష్ణువే వారికి దర్శనమిస్తారు. ఇంతటి మహనీయునకు తాను శరీరం వదలబోతున్నానని ముందు తెలిసే ఉంటుంది. శ్రీ పోతులూరి వీరబ్రహ్మంగారు శ్రీ సిద్ధయ్యగారిని పూలకు పంపి సమాధి చెందుతారు. ఎందుకు? తాను సమాధిలో ప్రవేశించడం చూచి తట్టుకోలేక శ్రీసిద్ధయ్య గారి గుండె ఆగి పోతుందని, అలాగే శ్రీ మాధవదాసుగారి గురువు గారు కూడా శ్రీ మాధవదాసు గారిని మంచినీరు తెమ్మని పంపి శరీరం వదులుతారు. తిరుమంత్రం భూమి మీద వ్రాసి పోతారు. ఋణానుబంధం ప్రకారం అప్పుడే చదువు రాని ఈటెలసాని ఆ మంత్రము చూచి తాటి పత్రంపై ముగ్గు వేసినట్లు వ్రాసుకొని చెవులలో ధరించి వెళ్ళుతుంది. అప్పుడు శ్రీ మాధవదాసుకు పరమాత్మ గొల్లపిల్లవాని రూపములో దర్శనమిచ్చి ఆ మంత్రము ఈటెలసాని వ్రాసుకొని చెవులలో ధరించి వెళ్ళిందని చెప్పి ఆమెకు సేవ చేసి తగిన సమయములో మంత్రము పొందమన్నారు. ఆమెకు సేవ చేసి ఋణానుబంధము తీర్చుకోమన్నదే ముఖ్య కారణము.

ఇక శ్రీ మాధవదాసు గారి గురు సేవ, వారి సాధారణత్వము మనందరికి గొప్ప పాఠాన్ని బోధిస్తుంది. కీకారణ్యములో నీటికై అన్వేషించు దాసు గారికి హంసలు తమ నీడన వస్తే నీరు చూపుతామని పల్కి నీరు చూపించడం వారి గొప్పతనానికి, గురుకృప ఎంతగా పొందాడనేందుకు తార్కాణము. అట్టి కీకారణ్యములో నాలాంటి ఇంద్రియ లోలునికి, కఠోర నియమ పాలన లేని వానికి హంసలు తారసిల్లి నీరు చూపునా? గొడుగు వలె నీడనిచ్చునా?

వారి సాధారణత్వమునకు మరియొక నిదర్శనము - విస్తర దొన్నెవలె కుట్టి బియ్యం నీళ్ళు కడిగి కట్టెల పొయ్యి మీద (ప్రెజర్ కుక్కర్ కాదు) వంట చేయడం. అంతటి మహిమాన్వితమైన క్రియ జరుగుచున్నను అదంతా గురు మహిమ యనుకొన్నాడే కాని తన గొప్పయని కలనైనా తలవలేదు. మంచినీరు తెమ్మన్న గురువాజ్ఞను శిరోధార్యముగా భావించాడు. కాని ఈ కీకారణ్యములో నీటి కొరకు



ఎక్కడని వెతికేది అని గురువు గారి మాటపై శతకోటి అనుమానాలు, అనంతకోటి ప్రశ్నలు మనకొస్తాయి. నేరుగా దోవ పట్టుకొని పొమ్మని శ్రీస్వామి వారు చెప్పినప్పుడు - మనమైతే రోశిరెడ్డి గారివలె పోగలమా? నిజమైన శిష్యుడు గురువు మాటకు ఎదురు ప్రశ్నేవేయడంటారు శ్రీ భరద్వాజ మాష్టరు గారు.

నిజమైన శిష్యుడు ఎలా నడుచుకుంటాడు, మానవ జన్మ సాఫల్యమొందడ మెలాగ అనే దివ్యమైన విషయాలు బోధించే ఈ గ్రంథము మనకందించిన అవధూత శ్రీ వెంకయ్య స్వామి వారికి, పూజ్య గురుదేవులైన శ్రీ భరద్వాజ మాష్టరు గారికి అనంతకోటి సాష్టాంగ దండ ప్రణామములు సమర్పిస్తున్నాను.

ఇట్లు
మూర్ఖబాలుడు.

# శ్రీ మాధవదాసు దివ్య చరిత్ర

శ్రీ మాధవదాసు గారు దక్షిణ భారత దేశము నందు తంజావూరు సమీపాన చోళ రాజ్యములోని నాటి తిరుక్కురుంగుడి యను గ్రామమున జన్మించెను. చిన్ననాడే తల్లిదండ్రులు చనిపోయారు. పూవు పుట్టగనే వాసన తెలియు నన్న సామెతగా చిన్న నాటి నుండి భక్తి, వైరాగ్యములు, జ్ఞానము, చిత్త విశ్రాంతి వీరికి ఆభరణములయ్యెను. జన్మ సంస్కారములెంత బలీయములో గదా! పండ్రెండు సంవత్సరముల బిడ్డ ఇల్లు వదలి వెళ్ళి పోతూ తన వారికి తన స్నేహితులకు ఇలా జ్ఞాన బోధ చేస్తున్నాడంటే అదంతా పూర్వ జన్మ సంస్కారము గాక మరేమిటి? తన చిన్న తనముననే తన తల్లిదండ్రులు గతించారనే చింతే వీరికి లేదు. శ్రీ మన్నారాయణుడే తన తల్లి, తండ్రి, సర్వమూ అనే ఎరుక చెదరక మదిలో నిలిచియున్న ఈ మహనీయునికి చిత్త విశ్రాంతి గాక చింతేముంటుంది?

పండ్రెండు వత్సరముల చిన్నారి యొక్క జ్ఞానధార మనందరికీ మేలుకొలుపే.

"వచ్చిన రాత్రులే తిరిగి తిరిగి వస్తున్నాయి. పొట్టనింపుకునే పనులు పుట్టినది మొదలు చనిపోవు వరకు చేస్తూనే ఉన్నాము. కానీ అను క్షణము మనము మృత్యువుచే మ్రింగబడుచున్నామని, మనమెందుకు మానవ జన్మ కొచ్చామో ఆపని చేయడం లేదని కోటీశ్వరుల దగ్గరనుంచి కడు బీదవారి వరకు అందరమూ మరచి పోవుచున్నాము. ఇది ఎంత చిత్రమో గదా!" అని తన వీడ్కోలు సందేశమిస్తున్నారు.

ఈ చిన్న బిడ్డ నిజమైన భక్తుల గొప్పదనము సత్ సంగ మహిమను గూర్చి వారికి చెపుతున్నాడు. "మహాభక్తుల స్నేహము దొంగలపహరించ వీలుకాని సంపదనిస్తుంది, మనలోని అరిషడ్వర్గాది దుష్టగుణములను హతమారుస్తుంది. సత్ సంగమున సర్వపాపములూ హరించును."

"ఎన్నో జన్మల నుండి ఎందరో తల్లి దండ్రులు మనకు వస్తున్నారు, పోతున్నారు. అట్లే బంధుమిత్రులు కూడా ఋణానుబంధముగా వచ్చి పోతున్నారు. కానీ ఆత్మజ్ఞానము ప్రసాదించు సద్గురువు మాత్రము దొరకడంలేదు. ఈజన్మలోనైన సద్గురు సేవ చేసి తరించాలని పోతున్నాను. పెద్దలైన మీరంతా నన్నాశీర్వదించండి" అని చెప్పి వారి వీడ్కోలు తీసుకొని గృహము వదలి వెళ్ళాడు.

పన్నెండు సంవత్సరముల చిన్నారి, బాల ప్రహ్లాదుని వలె అనేక పుణ్య క్షేత్రములు



తిరిగి వెంకటాచలంబనబడు పుణ్యక్షేత్ర సమీపమున ఒక పల్లెటూరికేతెంచాడు. ఆ గ్రామము నందలి గ్రామ చావడిలో పరుండ బోయాడు. అచ్చట కొందరు మూఢులు ఆ చావడిని స్త్రీ పురుష కేళీవిలాస స్థానము చేసికొని కన్నుగానని వారై శ్రీ మాధవదాసును దుర్భాషలాడి అచ్చట నుండి వెళ్ళగొట్టారు. ఆ మహనీయుడు ఆ రాత్రికి మరి యొకరి అరుగుపై పడుకొని తెల్లవారు జామున లేచి శ్రీహరిని కీర్తించుచూ వెంకటాచలంబునకు వెళ్ళెను. తెల్లవారి ఆగ్రామ ప్రజలు మేల్కొని ఆమార్గంబున వచ్చుచు పోవుచు ఆ చావడిలో రాత్రి కేళీవిలాస మొనర్చిన స్త్రీ పురుషులు ఒకరినొకరు కౌగలించుకొని వళ్ళు తెలియని ఘాఢనిద్రలో మునిగి శిలలవలె పడియున్న వారిని చూచి, వారి సిగ్గుమాలిన ప్రవర్తనకు వారిపై కేకరించి ఉమ్మివేయుచు వెడలుచుండిరి. శ్రీ మాధవదాసు గారు పాండురంగగిరి మొదలు హరిద్వారం వరకు అనేక పుణ్య తీర్థంబుల సేవించుచు హరిద్వారంబను పుణ్యక్షేత్రము చేరెను.

## గురు సమాగమము

హరిద్వారంబున ఒకచోట కృష్ణాజినముపై ఆశీనుడై బ్రహ్మవర్ఛస్సుతో వెలిగి పోతున్న ఒకమహనీయుని చూచి వారికి భక్తితో ప్రదక్షిణము చేసి, సాష్టాంగ దండ ప్రణామములాచరించెను. ఆ మహనీయుడు శ్రీ మాధవదాసు గారి యోగ క్షేమంబులు, రాకకు కారణము అడిగి తెలుసుకొని తన శిష్యునిగా స్వీకరించెను.

"బాబు! కోర్కెలనెల్ల విడిచి మనసు నిలకడ చేసుకోవలెను. పరమ గురుడే పరబ్రహ్మ మని ఎల్లవేళల హృదయములో మరచి పోని ఎరుకతో బ్రతకవలెను. వేదాంత శాస్త్రములు వప్ప జెప్పవచ్చు కానీ ఆత్మానుభవము పొందిన వారు చాలా చాలా అరుదు. తన శరీరము, ధనము, సర్వము సద్గురువున కర్పించానని చెప్పవచ్చు గాని లోభగుణం పోవుట చాలా అరుదు. దానము, ధర్మము, నియమ నిష్టలు, శాస్త్ర శ్రవణము సర్వమూ మనసును నిగ్రహించు సాధనలని ఎరుగవలెను. గడ్డము పెంచడము, కాషాయాంబరములు ధరించుట, విభూతి ధారణ, రుద్రాక్ష ధారణ ఇవన్నియు తాను పవిత్ర జీవితానికంకితమయ్యాను అనే విషయమును అనుక్షణము సాధకునకు గుర్తు చేసే సాధనలు మాత్రమే. ఆశ చావక, మనసును నియమించలేని సాధనలన్నీ వ్యర్థమే.

"తొమ్మిది ద్వారముల కొంపైన ఈ మాయ శరీరమును నమ్మి, కోమలాంగుల పొందుకై అర్రులు జాచుచున్నాము. శాశ్వతానందము పొందే సాధనకు

దూరమౌతున్నాము. మన పాపాని కంటె ఎక్కువగా పుణ్యముంటేనే గాని ఏ సాధన చేయలేము, సద్గురు సమాగమము జరుగదు. జరిగినా వారాదేశించే మార్గములో జీవించ గల్గడం చాలా కష్టము. పూర్వ జన్మ పుణ్యమే మనలను ఆచరణ శీలుర జేయును. పరోపకారం పుణ్యం. పర పీడనము పాపమన్నారు. ప్రతి ఫలాపేక్ష లేకుండా ఇతరులలోని దైవాన్ని గుర్తిస్తూ వారికి చేసే ఉపకారమే గట్టి పుణ్యము. ఇతరులకు బాధ కల్గించేదే పాపం. పూర్వ జన్మ యనగా మరొక తల్లి గర్భవాసాన జన్మించడము కాదు. పూర్వ జన్మయనగా క్రిందటి రెప్పపాటు వరకు అని అర్థము. ఆ పుణ్యమేదో ఈ క్షణములోనే చేయ వచ్చును. దాని ఫలితము మరు క్షణమునకు పూర్వపుణ్యమౌతుంది. మనలోని దుర్గుణాలను గుర్తించి వాటిని పోగొట్టుకొనే తీవ్ర ప్రయత్నం చేస్తూ సద్గురుని సేవిస్తే సర్వం లభిస్తుంది. ఈ విశాల విశ్వమంతా శ్రీ సద్గురుని సగుణ రూపమని నమ్మి మనం చేసే ప్రతి పని వారి సేవగా నామజపం జోడించి చేస్తుంటే తప్పక పుణ్యం పెరిగి ప్రత్యక్షంగా శ్రీ సద్గురుని సేవించే భాగ్యం కలుగుతుంది. ఈలోగా క్రొత్త బంధాలు తగులు కోకుండా జాగ్రత్త పడుతుండాలి. మనకు వ్యక్తుల పట్ల గాని వసుల పట్ల గాని వ్యామోహముండరాదు. వ్యామోహము ఉన్నప్పుడు సంతోషము గాని, దుఃఖము గాని కలుగును. అవి లేకుండా మనలు కోవడమే బంధాలు లేకుండా ప్రవర్తించడం. మనలో ఉండే రాగద్వేషాలు, చాపల్యాలు, ఈషణత్రయంబు, అష్టమదంబులు పోగొట్టుకునే తీవ్ర ప్రయత్నం చేస్తుంటే తప్పక సద్గురు సమాశ్రయం జరుగుతుంది.

"ఆత్మజ్ఞానమనునది శాస్త్రములు కంఠత పెట్టి నందున గాని, మంత్రములు జపించుటచే గాని, మాయా మంత్రంబులకు, గోకర్ణ గజకర్ణ టక్కు టమారములకు గాని, ఆచారములు పాటించుటచే గాని, వేషధారణ వల్లగాని లభించదు. కేవలము సద్గురు సేవ వల్లను వారి ఆజ్ఞలను కఠోర నియమ పాలనతో పాటించడం వల్లనే లభిస్తుంది. ఇందుకు బోలెడు నిదర్శనాలు శ్రీ గురు చరిత్ర అనే గ్రంథములో కనిపిస్తాయి.

"అహంకారులకు, ద్వేషమును వీడని వారికి, విద్యనపహరించు వారికి, కృతజ్ఞతా భావము లేని వారికి, కలహప్రియులకు, గర్వాంధులకు, విషయ భోగలాలసులకు, స్తంభన, మోహన, ఉచ్చాటనాది మంత్రములు అభ్యసించు వారికి, జగత్తు పై మోహము వీడని వారికి, బాధ కోర్వలేని సోమరులకు, వినయము, భక్తి, విశ్వాసములతో గురు శుశ్రూష చేయని వారికి, గురువాజ్ఞలకు ఎదురు చెప్పక ఆచరించలేని వారికి ఆత్మ విద్య ఎన్నటికి



లభించదు" అని గురువు గారు చెప్పగా శ్రీ మాధవదాసు తన మనస్సులో నిట్లనుకొనెను, "తల్లిదండ్రుల ఋణము, దైవ ఋణము, ఋషిఋణము సద్గురుని ఋణము ఎంత చెల్లించినా తీరదని పెద్దలు చెప్పుదురు. గనుక గురు ఋణము సేవద్వారా తీర్చవలెనని" మనమున స్థిరనిశ్చయము చేసికొని గురు సేవలో కాలము గడుపుచుండెను.

ఆ గురు శిష్యులు యమునా నదీతీరంబున ప్రయాణము చేయుచు పెద్దలను సేవించుచు, పుణ్య తీర్థములలో స్నానమాడుచు ప్రయాణము సాగించిరి.

ఎంత కాలము గడిచినను తన గురుడు తనకు మంత్రోపదేశము చేయలేదని విసుగు చెందక ఆ మహానుభావుండు తనలో తానిట్లను కొనెను.

"కావలెను అనే తాపత్రయంబులు సర్వము హృదయము నుండి పూర్తిగా నశించక, ఈషణత్రయంబు విడువక, గుణత్రయంబు పూర్తిగా అణగారక, అరిషడ్వర్గంబులు, అష్ట మదంబులు నిర్మూలము కానిదే గురు కృప కల్గి మంత్రోపదేశము లభించదు గదా" యని మనంబున నిశ్చయించుకొనెను. నాలో ఏదో మాలిన్యమున్నది. గనుక గురూపదేశము లభించలేదని నిర్ణయించుకొని ఇంకా దీక్ష, పట్టుదలతో తన గురుని సేవించుచుండెను. నా పుణ్యము గట్టిదైనందున ఇట్టి పరమగురు సేవ లభించినదనే సంతోషంబుచే పొంగి పోవుచుండెను.

ఇట్లు యమునా నదీతీరంబున బోవుచు హస్తినాపురమార్గంబును బట్టి పోవుచుండిరి. గురువు గారు వయోభారంబుచే నడువలేనప్పుడు శ్రీ మాధవదాసు గారు గురుని తన భుజముల మీద ఎత్తుకొని హరిని ధ్యానించుచూ చాలా దూరము నడిచి పోవుచున్నాడు. "నాయనా! నాకు దాహముగా నున్నది, త్రాగేందుకు నీరు తెమ్మని" గురువు గారొక చెట్టు నీడన విశ్రమించెను.

శ్రీ మాధవదాసు గారు చెంబు తీసుకొని నీటికై వెదకుచు అడవిలో ఎచ్చటను నీరు గానక గురువును వదలి ఎంతో దూరము వెళ్ళి చాలా చింతించుచుండెను. ఈ అడవి మార్గములో నీరు తీసుకువెళ్ళి తిరిగి నా గురువు గారిని చేరగలనో లేదోనని దుఃఖించుచున్నాడు.

నాలాంటి మూర్ఖుడైతే "ఈ అడవిలో నీళ్ళెక్కడున్నాయి గురువు గారు, కాస్త ఓపిక పట్టండి ఒక గ్రామానికి చేరి దప్పిక తీర్చుకొందురు" అని చెప్పి ఉండే వాడే. కానీ శ్రీ మాధవదాసు గారు గురువు గారి మాటకు ఎదురాడని శిష్యోత్తముడు. నీరు తెమ్మంటే తెచ్చే

ప్రయత్నము చేస్తున్నాడు గాని అన్యచింతలే లేక తన ప్రయత్నము మానక గురుని ఎడబాటుకు తీవ్రంగా బాధ పడుచుండెను. అలాంటి బాధాసమయములో తన గురుని కృప వలన ఆకసమున బోవు ఐదు రాజహంసలను చూసి, " ఓ హంసలారా! దయ చేసి ఈ మహారణ్యములో నీరెచ్చటనున్నదో మీరైన చెప్పండి" అని అడుగెను. గొప్ప విచిత్రముగా మనుష్య భాషనర్థము చేసుకొని ఆ రాజహంసలు మనుష్య భాషలోనే సమాధానము చెప్పాయి. "ఓ దాసుడా మా నీడనే రమ్ము, నీకు నీరు చూపెదము" అని ఆ హంసలు భూమికి చేరువలో ఎగురుచూ శ్రీ మాధవదాసునకు గొడుగు వలె నీడ పట్టుచు తీసుకు వెళ్ళి ఒక చక్కని సరోవరమునందలి నిర్మల జలమును చూపెను.

ఈ సన్నివేశము మాధవదాసు గారి గురువుగారు ఏర్పరిచినదే గాని అన్యంబు కానేరదు. తన ప్రియశిష్యుడు నీరు కానక, నీరు వెదికే ప్రయత్నము మానక ప్రాణములకు తెగించి ఆ ఘోరారణ్యములో చేయు తీవ్ర ప్రయత్నమునకు సంతుష్టుడై తానే హంసల రూపంబున శ్రీ మాధవదాసు గారికి కనిపించారు. దిక్కు తోచని శ్రీ మాధవదాసుతో హంసలు మనుష్య భాషలో మాట్లాడి, తమ నీడను గొడుగు వలె పట్టి తీసుకు వెళ్ళి సరోవరము చూపడమేమిటి? ఇదంతా కట్టుకథ అంటే మనకు పుట్టగతులుండవు. ఎందుచేత? ఈ గ్రంథమును చదివించుకొని భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి వారు విని శరీరం వదిలారు. ఈ కథంతయూ నిజమే ననేందుకు అది ఒక్కటే మనకు సాక్ష్యము.

ఇచ్చట శ్రీ మాధవదాసు గారి గొప్పదనము కనబడుచున్నది. నాలాంటి మూర్ఖుడైతే వెంటనే కడుపు నిండా నీరు త్రాగి, ముఖము కడిగి గురువు గారికి నీరు తెచ్చేవాడు. కానీ శ్రీ మాధవదాసు గారు చెంబుతో నీరు తీసుకొని పరుగు పరుగున గురువు గారి యొద్ద కొస్తున్నాడు కానీ గురువు గారి కంటే ముందు తాను దాహము తీర్చుకోలేదు. అది ఉత్తమ శిష్యుని పద్ధతి.

శ్రీ మాధవదాసు గారు నీరు తీసుకు వస్తూ ఇంకా మార్గంబుననే ఉన్నారు. అట్టి సమయంబున వారి గురువు గారు చెట్టు నీడన పడుకొని యున్నారు. అప్పుడొక బంగారు విమానము వారి యొద్దకు వచ్చి ఆగింది. అందుండి నలుగురు విష్ణుదూతలు దిగి గురువు గారిని సమీపించారు. "ఓ భాగవతోత్తమా! మేము విష్ణుదూతలము. తమరీ దివ్య విమానమునెక్కి వేగమే విష్ణులోకమునకు రావలెను. మిమ్ములను పరమపదంబునకు తీసుకు పోవుటకు వచ్చాము" అని విన్నవించిరి.



తనను ఇంత కాలము నీడవలె వెన్నంటి సేవించిన తన ప్రియశిష్యుడు లేడని ఆ గురువు గారు వగచి ఆ తిరు మంత్రంబును నేలపై వ్రాసి శరీరమును విడచెను. సూక్ష్మ శరీరముతో ఆ దివ్య విమానమునెక్కి విరజా నది జేరెను. అచ్చట ఐదువేల అప్సరసలు వారి సూక్ష్మ శరీరమునకు హారతులిచ్చిరి. దశవిధ వాద్యంబులతో స్వాగతం పలికిరి. దేవతలందరూ తగు విధంబుగా వారిని పూజించి సత్కరించిరి. ఆ మహనీయుడు వైకుంఠంబున శ్రీ మహావిష్ణు దర్శనము చేసుకొని ఆ మహా పురుషుని పూజించి, కీర్తించి ప్రయాణమాయెను. శ్రీ మహా విష్ణుదేవుని ఆజ్ఞ మేరకు వారికి హారతులిచ్చి, పచ్చల గొడుగులు పట్టి, సుగంధ పరిమళములను పూసి సత్కరించిరి.

శ్రీ మహావిష్ణు దేవుని వలన ఇట్టి గొప్ప సత్కారము నందిన ఆ మహా మహుడెంతటి గొప్ప వాడో మన కవగతమగుచున్నది. ఆ ముక్తాత్మ నిస్సంశయముగా బ్రహ్మ రుద్రాదులకును, ముప్పదిమూడు కోట్ల దేవతలకును, ఋషులకు, అణిమాది అష్ట సిద్ధులు పొందినవారలకును దుర్లభంబైన యపవర్గంబు చెంది యుండెను. కోటి సూర్య ప్రకాశమానుండై, పరబ్రహ్మము నందు లీనంబై, నిత్యుండై, పరమ సౌఖ్యంబు నంది యుండెను.

త్రిమూర్తుల మన్ననలందిన వాడు, ముప్పది మూడు కోట్ల దేవతలచే పూజింపబడిన వాడు, అణిమాది అష్ట సిద్ధులు పొందిన మహనీయులకు పూజనీయుడైన యా మహనీయుడు తన ప్రియ శిష్యునకు మంత్రోపదేశము చేయకుండా నీటి కొరకు శిష్యుని పంపి తాను శరీరము చాలించుట ఆశ్చర్యము కాదా? అంత గొప్ప మహనీయునకు తాను శరీరము త్యజించు సమయము తెలియక యుండునా?

ఆ మహనీయుడు సర్వజ్ఞుడు, తన ప్రియ శిష్యుడైన మాధవదాసు గారికి గల ఋణానుబంధాలు సర్వమూ తెలుసు. తాను శరీరము వదులు సమయములో శ్రీ మాధవదాసు తన చెంతనున్నట్లైన ఆ ఎడబాటు సహించ లేక గుండె ఆగి చనిపోవునని కూడా తెలుసు. గనుకనే ఘోరారణ్యంబున చెట్టు నీడన కూర్చొని మాధవదాసును నీళ్ళు తెమ్మనే మిషమీద దూరముగా పంపి శరీరము వదిలారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి గారు శ్రీ సిద్ధయ్య గారిని పూలకు పంపి సమాధి నిష్ఠులైనట్లు ఉన్నది. విశ్వ చైతన్యమే తానైన ఆ గురువు గారు హంసల రూపమున తన ప్రియ శిష్యునకు గొడుగు వలె నీడ పట్టి, మార్గము చూపి నీటి కొలను చూపారు. అప్పుడే ఈటెలసాని ఆ మార్గమున పోవు నట్లు జేసి ఆ

మంత్రమును తాటియాకు పై వ్రాసి చెవులకు ధరించునట్లు చేశారు. గురువు గారే పశువుల కాపరి రూపమున శ్రీ మాధవదాసుకు కన్పించి ఈటెలసాని మంత్రము వ్రాసుకొని పోయినదనియు, ఆమె దగ్గర సేవ చేయుచు ఋణానుబంధము తీర్చి తగు సమయము చూచి మంత్రమడుగుమనియు సలహా ఇచ్చారు.

కనుక ఋణానుబంధము లెంత బలీయమైనవో వాటిని తీర్చనిదే బ్రహ్మానుభూతికై తాపత్రయ పడుట ఎంత వెర్రితనమో యోచించాలి. అందుకై పూజ్య భరద్వాజ గారు మనుస్మృతిలో చెప్పిన వాక్యము మనకెరుక పరచారు. ఋణానుబంధాలు, వాగ్దానాలు, బాధ్యతలు, చేసిన ప్రమాణాలు తీరనిదే బ్రహ్మానుభూతి కొరకు ప్రయత్నిస్తే పాడైపోతావు అన్నారు.

ఆచార్య శ్రీ భరద్వాజ మాష్టరు గారు చెప్పే సలహా ఏమిటంటే పాత ఋణాను బంధాలు వగైరా బాబాకు వదలండి. వారు వాటిని స్వప్నాలలో అనుభవింప జేస్తారా, కొద్దిపాటి అనుభవం ద్వారా క్షాళన చేస్తారా, లేక తన తపశ్శక్తితో నిర్మూలిస్తారా, లేక మరొక జన్మకు మార్చుతారా అనేది వారికి సంబందించిన విషయము. ప్రస్తుతం మీకు క్రొత్త బంధాలు తగులు కోకుండా చూచుకోండి అంటారు. బంధాలు తగులు కొన్నట్లు మనకు మనమే తెలుసు కోవచ్చు. అయ్యో ఇలా అయిందే అని హృదయంలో దుఃఖ పడరాదు. అదే ఋణాను బంధం సృష్టించుకున్నామా లేదా అనే దానికి గుర్తు.

## ఈటెలసాని మంత్రమును వ్రాసికొని పోవుట

ఒక ఈటెలసాని తన బిడారముతో ఆ మార్గమున బోవుచున్నది. ఆమె ఇరు పార్శ్వంబులను ఆమె చెలికత్తెలు వెంట నడువ, వేట కుక్కలతో, మగవారు ఈటెలు, బల్లెంబులు ధరించి, సామాన్లు గాడిదలపై వేసుకొని నడుచుచుండిరి. చెట్టు నీడన పరుండి యున్న గురువు గారిని చూచి ఈటెలసాని అచ్చట నిలచెను. గురువు గారు పరమ పదమందినారని తెలుసుకొన్న ఈటెలసాని, ఆ మహనీయుని కుడిచేతి యొద్ద నేలపై వ్రాసి యున్న మంత్రమును చదివెను. వెంటనే ఆ మంత్రమును తాటి ఆకులపై వ్రాసి చెవులలో పెట్టుకొని ఆ మంత్రమును తుడిచివేసి వెళ్ళెను.

ఈటెలసాని వెళ్ళిన కొంత సేపటికి శ్రీ మాధవదాసు గారు నీరు తీసుకొని తన గురువు గారి యొద్దకు వచ్చెను. ముకుళిత హస్తుండై "ఓ గురు రాయా మీ ఆజ్ఞ మేరకు నీటి కొరకు అడివంతయు తిరిగితిని కానీ నీరు దొరకక దిగులు చెందియుంటిని. అట్టి సమయంబున



ఆకసమున బోవు ఐదు హంసలను జూచి నీరు దొరుకు స్థలమును జూపమని ప్రార్థించితిని. మీ దయ వలన ఆ హంసలు తమ నీడను నాకు గొడుగు వలె పట్టి నన్ను నీటి దగ్గరకు తీసుక వెళ్ళినవి. తమ కొరకు నీరు తెచ్చాను. దయచేసి లేచి దాహము తీర్చుకోండి ప్రభూ" అని అనేక సార్లు విన్నవించసాగెను. కాని కదలక మెదలక యున్న తన గురుని ముఖముపై నున్న ముసుగును తీసి, గురుని శరీరమును చేతితో తాకి చూచెను. తన ప్రియాతి ప్రియమైన గురువు పరమ పదించాడని ఎరిగి కొండ ఒరిగినట్లు భూమిపై కొరిగి ఘోరముగా దుఃఖించ సాగెను. ఇట్లు దుఃఖించుచూ భూమి పైనున్న గురుతులను జూచి ఇట్లనుకొనెను.

"నా ప్రియతమ గురువు గారు నాపై కరుణచే తిరుమంత్రమును భూమిపై వ్రాశారు. ఈ మార్గమున బోవు వారెవ్వరో దానిని తుడిచి వేశారు. ఇప్పుడు నేనెవ్వరిని అడుగుదును. అకటా! ఎంతటి కష్టము సంప్రాప్త మయ్యె"నని మిగుల దుఃఖించ సాగెను.

"హే కరిరాజవరదా! మా పాపంబుల హరించు భక్త వత్సలా, రణధీరా, నను గావుమా ప్రభో. గురువును కోల్పోతిని, తిరుమంత్రము దక్కదాయె. ఏ దిక్కు లేని నేను నిన్నే దిక్కని నమ్మితిని ప్రభో! నేడు నను బ్రోచి కావకయున్న దిక్కెవ్వరయ్యా" అని పలువిధంబుల శ్రీహరిని ప్రార్థించి, తన ప్రియ గురుని కళేబరమును ఎంతో దుఃఖముతో భూస్థాపితము జేసి, పూజ సల్పి కన్నీరు మున్నీరుగా దుఃఖించుచూ కదలి పోవుచుండెను. అట్టి దయనీయమైన పరిస్థితిలో పశువుల కాపరి పిల్లవాని రూపమున శ్రీహరి మాధవదాసునకు దర్శనమిచ్చెను. కొండంత ఆశతో మాధవదాసు ఆ పశువుల కాపరి పిల్లవానిని ఇట్లు ప్రశ్నించెను. "బాబూ ఈ బాటన ఇంతకుముందు ఎవరైనా బాట సారులు వెళ్ళారా?" "అయ్యా ఈ బాటన ఇప్పుడే ఒక ఈటెలసాని తన బిడారుతో వెళ్ళింది" అని పశువుల కాపరి పలికెను. అందుకు మాధవదాసు "బాబూ! ఈటెలసాని అంటే ఎవ్వరు? నేను వారిని చేరే మార్గము తెలుపు"మని వినయముగా అర్థించెను..

ఆ పశువుల కాపరి రూపమున నున్న శ్రీహరి ఇట్లు చెప్పెను. "ఈటెలసాని యనగా దొమ్మర పడుచు. ఆమె తీగ నెక్కి (సర్కసులలో వలె) నాట్యము చేయును. ఒక చేతిలో బ్యాలెన్సు కొరకు గొడుగు పట్టుకొని యుండును. ఆమె గుంపులో స్త్రీ పురుషులు నూరు మందికి పైగా ఉందురు. వారితో గూడ కొన్ని రేచు కుక్కలు ఉండును. వారు తమ సామాను నంతయు గాడిదలపై వేసుకొని ప్రయాణము చేయుచుందురు. ఊరూరా

తిరుగుచు ఢంకా ఢమారములు వాయించుచు ప్రదర్శనము లిచ్చుచుందురు. నీవు వెంటనే వెళ్ళినట్లయిన ఈ ఈటెలసాని బిడారు నీకు లభ్యమగును."

పశువుల కాపరి రూపమున నున్న శ్రీహరి మరియు నిట్లు ప్రశ్నించెను. "ఓ దాసుడా! 'ఈ మార్గమున ఎవరైనా బోయినారా?' అని యడుగు చున్నావు. వారితో నీకేమి పని?" యని ప్రశ్నించెను. అందులకు మాధవదాసు గారు ఇట్లు చెప్ప సాగెను. "అయ్యా నేను నా ప్రియతమ గురువును చాలా కాలము సేవించుచుంటిని. నాకెవ్వరూ దిక్కులేరు. నా గురువే నాకు తల్లి, తండ్రి, స్నేహితులు, బంధువులుగా నన్నెంతో ప్రేమతో సాకు చుండెను. మేమీ అరణ్య మార్గమున యాత్రార్ధమై పోవుచుంటిమి. మా గురువు గారికి ఎంతో దాహముగా నున్నందున నన్ను త్రాగునీరు తెమ్మని వారొక వృక్ష ఛాయలో విశ్రమించిరి.

నేను మంచినీరు తెచ్చుట ఆలస్యమైనది. నేను వచ్చు సరికి నా యందు గల వాత్సల్యముచే శ్రీ మదష్టాక్షరీ మహా మంత్రంబును భూమిపై తమ కుడి చేతి వ్రేలితో వ్రాసి స్థూల శరీరంబు వదిలిరి. ఆ మహనీయుండు జన్మరాహిత్యంబు నొంది విశ్వ చైతన్యుడై నిలిచెను. నేను ఘోరంబుగా దుఃఖించి ఆ మహనీయుని సమాధి యొనర్చి భక్తితో పూజ చేసి దుఃఖించు సమయమున నా పుణ్య వశంబున తమరు ఈ రూపంబున దర్శనమిచ్చినారు. నన్నోదార్చుటకు ఎవ్వరూ లేని ఈ ఘోరారణ్యంబున మీరత్యంత కరుణతో ఈటెలసానిని గూర్చి చెప్పి నాకత్యంత సహాయ మొనర్చితిరి. తమరే నా పాలిటి శ్రీహరి" యని మాధవదాసు పలుకగా మాయా మానుష విగ్రహుండైన శ్రీహరి ఇట్లనెను. "నేను గొల్లబోయడను. నన్ను నీవు శ్రీ కృష్ణుడనిన అది చెల్లునా? ఆలమందలు మేపుకొని పాలతో జీవించే వెర్రి గొల్లవాడనయ్యా. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, ఆదిమధ్యాంతరహితుడు, పురుషోత్తముడైన సర్వేశ్వరుడెక్కడ! ఆవుల కాయు అమాయుకుడనైన నేనెక్కడ? నీవు పరమ పుణ్యాత్ముడవు. నీ దర్శన మాత్రముననే నా యజ్ఞానము నశించి జ్ఞానోదయమైనది. నేను చూచిన విషయమును నీకు విశదముగా వివరించుచున్నాను వినుము. ఆ ఈటెలసాని ఈ మార్గమున బోవుచు మీ గురువు కడ నిలచి వారి కుడి చేతి యొద్ద భూమిపై వ్రాయబడిన తిరుమంత్రమును తాటాకులపై వ్రాసి చెవులలో బెట్టుకొని వెళ్ళింది. నీవు ఆమె కడ సేవకుడవై బానిస పనులు చేయుచు సమయము చూచి ఆమె దగ్గర ఆ మంత్రరాజమును పొందుము" అని చెప్పి ఆ గొల్ల పిల్లవాడు అంతర్ధానమాయెను.



"పరమ గోప్యంబైన తిరుమంత్రము ఈటెలసానికి దొరికెను. నేను నా ప్రియతమ గురువును కోల్పోతిని. ఇక నాకు దిక్కెవ్వరో దైవమా" యని పరి పరి విధముల చింతించుచూ ఆ అరణ్య మార్గమున మాధవదాసు అన్న పానీయములు లేక పోసాగెను. ఆ విధంబుగా కొంత దూరము పోయిన పిదపనొక గ్రామ పొలిమేరలో ఈటెలసాని గుడిసెలను చూచెను. అన్న పానీయములు లేక బడలికతో రెండు దినములు ఆ గుడారముల సమీపమున కూర్చొని యుండెను. అట్టి కష్టపరిస్థితిలో దైవ కృప వలన ఈటెలసాని మాధవదాసు గారిని తన దగ్గరకు పిలిపించి పిచ్చివానివలె అతి దయనీయముగా నున్న ఆ దాసుని వృత్తాంతమేమని అడిగెను.

ఈటెలసాని :- బాబూ మీదేగ్రామము? ఈఅరణ్యమార్గంబున ఏల వచ్చుచున్నావు?

మాధవదాసు:- అమ్మా! నేనొక అనాథుడను. నాకొక గ్రామమని లేదు. ప్రేమ పాత్రుడైన నా గురువు పరమ పదించారు. గనుక అన్ని గ్రామములు తిరుగుచున్నాను.

ఈటెలసాని :- అట్లయిన నీవు అన్న పానీయములకు ఇక్కట్లు పడనేల? నీవు మా గాడిదలను గాయుచు మా వద్ద ఉండినచో నీరు, అన్న వస్త్రము లిచ్చెదను. నీవు మా తోటి అన్ని గ్రామములు తిరుగ వచ్చును.

మాధవదాసు:- అమ్మా! నేను ఒకరి అన్నము తినరాదు. నేనే వండుకొని నా గురుదేవులకు నివేదన చేసి భుజించవలెను. గనుక దయతో అంత సంభావన ఇప్పించిన మీ దగ్గరే ఉండగలను.

అందులకు ఈటెలసాని అంగీకరించినందున మాధవదాసు ఈటెలసాని గాడిదల మేపు పనిలో చేరి గాడిదలను గాయుచుండెను.

"పరమ పురుషా, పరంధామా, శరణాగతరక్షకా! తిరుమంత్రము దొరికే మార్గము తెలుపు తండ్రీ! గాడిదలను గాచినను సంతోషమే. తిరుమంత్రము దొరికే మార్గము తెలుపుమా తండ్రీ! వ్రతము చెడినను ఫలితము దక్కెనను సామెతగా మంత్రము దొరికినట్లయిన పరమపదము కరతలామలకము గదా! ఈటెలసాని యొద్ద సేవ చేసినను సంతోషమే. కానీ మంత్రరాజము లభించే మార్గమున నడుపుమో దేవా!" అని శ్రీహరిని తలంచుచూ గార్దభముల దోలుకొని ఒక మునిపల్లె సమీపంబునకు బోయెను.

అచ్చట నున్న కొందరు మూఢులు మాధవదాసును సమీపించి "నీ పేరేమి? మీ

దేయూరు? మీ కులగోత్రంబుల తెల్పు"మని అడిగిరి. "అయ్యలారా! నేను హరిదాసుండను. నా పేరు మాధవదాసు" అని చెప్పెను. నీకు కుల గోత్రంబులు లేవా? అని గేలి చేయుచు, వీడు కులము చెప్పడం లేదు గనుక శిక్షించాలని కొందరనిరి. ఆ మూఢులంతా సమావేశమై మరియొక సారి అడిగి చూతుము అని మరలా ఆ మహా భక్తుని కులగోత్రము లేవియని అడిగిరి. మీరెవరో చెప్పమని మాధవదాసు యడిగెను. అందులకా దుర్మార్గులు నీవు మా కుల గోత్రములడుగు నంతటి వాడవా అని కోపించి మాధవదాసుని ఒక చెట్టునకు గట్టిగా బంధించిరి.

ఆ మూర్ఖులకు హితవచనంబులు తెల్పనెంచి మాధవదాసు వారికిట్లు తత్వోపదేశము జేసెను. "అయ్యలారా! ధనధాన్యములు, భార్యా బిడ్డలు గొప్పవనుకున్నారా! కులమే గొప్పయని భావించుచున్నారా. ఇదంతయూ మాయ యొక్క ప్రభావమే. ప్రతినిత్యము భగవంతుని స్మరించండి. పరమాత్ముని కనుగొని చరితార్థులుకండి.

"అయ్యలారా! ముందు ముందు వయసుతో వృద్ధాప్యము, బాధలెన్ని ఉన్నాయో మీ చుట్టు ప్రక్కల పరిశీలించి తెలుసుకోండి. ఇతరులను ఎగతాళిచేసిన భగవంతుడు మెచ్చడు. భూమిపై గొప్పకులము వారమని విర్రవీగకుడు. భగవద్భక్తి గలవారిదొక్కటే గొప్పకులము. తక్కిన వారంతా కులహీనులే. తల్లిదండ్రుల కంటే దేహబంధువు లెవ్వరూ లేరు. తప్పుడు సాక్ష్యము చెప్పిన వారిని, ధర్మం తప్పి నడచిన వారిని యమదూతలు నిప్పులలో నడిపిస్తారు. పరుల ధనమునకాశించిన వారిని, పెద్దలనిందించు వారిని యమదూతలు సమ్మెటలతో కొట్టి బాధిస్తారు. ధర్మము వీడి కర్మము సంపాదించిన ఎడల భగవంతునికి దూరమవుతాము. సంసారంలో ఉండికూడా తనలో సంసారము లేకుండా జీవించే నరులే పెద్దలు. అంతటికీ అనర్థహేతువు ఆశ మాత్రమే. ఏ జీవి ఏమి అనుభవించాలో ముందే నిర్ణయించబడి భూమిపై జన్మిస్తుంది. అవి తప్పక అనుభవించి తీరుతారు. అత్యాశచే ఎక్కువగా అధర్మంగా సంపాదించినా అదంతా బ్యాంకులలోను, చిరాస్థిగాను ఉంటుందేగాని ఆ జీవికి అనుభవించ వీలు కాదు. ధర్మంగా జీవించి సద్గురు కృప పొందడం మనకర్తవ్యము" అని బోధించెను.

అంతలో మాధవదాసుగారిని చెట్టునకు కట్టివేసిన మూర్ఖులకు కన్నులు కానరాక, తమ దుస్థితికి మిక్కిలి చింతించి, ఆ మహనీయుని కట్టివేసిన ఫలితముగా తమకు అంధత్వము ప్రాప్తించినదని గుర్తించి మాధవదాసును బంధవిముక్తుని జేసి పాదాక్రాంతులై క్షమాపణ



వేడికొనగానే వారి అంధత్వము పోయినందున తమ తమ గృహముల కేగిరి.

## మహనీయుడైన శ్రీ మాధవదాసు వంటచేయుట

మాధవదాసు మధ్యాహ్న సమయమున గాడిదలను ఒక చెట్టు క్రింద నిలిపి ఈటెలసాని ఇచ్చిన బియ్యమును ఒక ఆకు దొన్నెలో పోసితెచ్చాడు. ఆ ఈటెలసాని వండుకునేందుకు పాత్రలేమియు ఇవ్వలేదు గనుక ఆ బియ్యమును ఆకుదొన్నెలోనే కడిగి తగినన్ని నీళ్ళుపోసి రాళ్ళతో ఏర్పరచిన పొయ్యి మీద పెట్టాడు. ఆ పొయ్యిచుట్టూ మూడు కర్రలు నాటి తన ఉత్తరీయాన్ని పొయ్యికి చాటుగా కట్టాడు. చిదుగులతోను, పుల్లలతోను పొయ్యిమంటవేసి అన్నము ఉడికించి దానికి చింతపండు, మిరపకాయ ఉప్పుతో నలిపిన పచ్చడి చేర్చి తనప్రియతమ గురువుగారికి హృదయ పూర్వకముగా అర్పణజేసి భూతబలి గావించి - మిగిలిన భోజనము ఆరగించాడు.

ఇక్కడ మనకు శ్రీ మాధవదాసు గారి గొప్పదన మెంతటిదో స్పష్టముగా కనిపిస్తున్నది. ఆకుదొన్నెలో నీరు, బియ్యం పొయ్యి మీదపెడితే అసలు నిలిచేందుకే వీలులేదు. ఇంకా పొయ్యిలో మంటవేసి ఆ ఆకు దొన్నెలోని బియ్యం ఉడికించారు, ఇది సామాన్య మానవులకు సాధ్యమేనా? ఆకుదొన్నె కాలిపోయి బియ్యమన్నీ పొయ్యి పాలవ్వాలి. కానీ అలా కాకుండా ఆ ఆకుదొన్నే ఒక పాత్రగా వారికి సహకరించింది. ఇంత జరిగినా అది ఒక గొప్పమహిమగా తాను తలంచడంలేదు. అంతయూ తన గురుమహిమ యని తలంచి వారికి నివేదించుచున్నారు. అడివిలో హంసలు మాట్లాడడం, తమ నీడను వారికి గొడుగువలె పట్టడం , నీరు చూపించడం ఎంతచిత్రమో ఈ అన్నం వండటం కుడా అలాంటిదే. సద్గుణములు సహజ సిద్ధం కావడమంటే ఎలా ఉంటుందో శ్రీ మాధవదాసు గారి దగ్గరే చూస్తాము. ఎన్నో జన్మల పుణ్యఫలమో గాని గురువుని నమ్మి సర్వస్య శరణాగతి చేశారు. సర్వస్య శరణాగతి చేశాక ఇక ఎప్పుడైన గాని గురువుగారి మాటకు ఎదురు చెప్పిగాని, ఎదురు ప్రశ్నించిగాని ఎరుగరు. గురువుగారు సర్వజ్ఞులు, సర్వవ్యాపకులు, సర్వసమర్థులు అని మనకు నిదర్శనములు లభించే వరకు వారిని క్షుణ్ణముగా పరీక్షించుకోవచ్చు. శ్రీవివేకానందుడు శ్రీరామకృష్ణపరమహంస తొడపై నిప్పుకణిక పెట్టి పరీక్షించినట్లు, వారి పాన్పు క్రింద రూపాయ బిళ్ళ పెట్టి పరీక్షించినట్లు పరీక్షించ వచ్చు. కానీ సర్వస్య శరణాగతి చేశాక ఇక గురువు గారి మాటకు ఎదురు ప్రశ్న వేయడం ఉండ

కూడదనేది పెద్దల అభిమతం. ఈ సూత్రాన్ని తు.చ తప్పక పాటించారు గనుకనే శ్రీ మాధవదాసు గారు ఋణానుబంధాలు తీర్చుకొని, తిరుమంత్రాన్ని పొంది కృతార్థుడైనాడు. మనం కూడ కృతార్థులము కావాలంటే ఈ సూత్రాన్ని శ్రీ రోశిరెడ్డి, పోలిరెడ్డి, వక్కెమ్మ, తులసమ్మల వలె చక్కగా ఆచరించి కృతార్థులు కమ్మని తెలుపడమే ఈ కథను సంపూర్ణంగా విని శ్రీ వెంకయ్య స్వామి వారు శరీరం వదలడంలోని అంతరార్థం.

ఈవిధంగా శ్రీ మాధవదాసు గారు అతి ధైర్యముతో, అనన్యమైన సద్గురు భక్తితో ఆ ఈటెలసాని గాడిదలను మేపు చుండెను. ఆ ఈటెలసాని తన బృందముతో అచ్చటచ్చట తిరుగుచు క్రమంగా ఇంద్రప్రస్థపురంబునకు చేరెను.

ఆ ఇంద్రప్రస్థపురంబున ఈటెలసానియు ఆమె పరివారము ధర్మరాజు గారు చేయు రాజసూయయాగము యొద్ద జరుగు అన్నసంతర్పణ సత్రములో పంచభక్ష్య పరమాన్నములు భుజించి వచ్చారు. శ్రీ మాధవదాసు గారు మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతములో ఖరములను మేపుకొని అన్నానికి వచ్చారు. అప్పుడా ఈటెలసాని " ఓ దాసుడా ఈ గ్రామములో ధర్మరాజు గారు రాజసూయయాగము ఒక నెల నుండి చేస్తూ ప్రతి నిత్యము కోటి బ్రాహ్మణులకు అన్న సంతర్పణ చేస్తున్నారు. నీవచ్చటికి వెళ్ళి భుజించ"మని చెప్పింది. అది విని శ్రీ మాధవదాసు గారు - "అమ్మా నేను ఇతరులు వండిన ఆహారము తినను. గంజైనను స్వహస్తపాకమే. మాగురువు గారికి నివేదించి ఆ ప్రసాదము తినవలెను. ఇది నా గురువాజ్ఞ. గనుక నేనచ్చటికివెళ్ళి సంభావన నిమ్మని అడిగెదను" అని రాజసూయయాగము జరిగే చోటుకు వెళ్ళాడు.

ఇక్కడ మనకు శ్రీ మాధవదాసు గారికి గురువాజ్ఞపై గల సంపూర్ణ విశ్వాసము, శ్రద్ధా భక్తులెంత గొప్పవో తెలుస్తుంది. వారు ఈటెలసాని దగ్గరకొచ్చే సమయానికే మధ్యాహ్నం రెండు గంటలకుపై బడినది. తన యజమానురాలి మాట ప్రకారము రాజసూయయాగము జరిగే చోట భిక్షతెచ్చి వండి గురువు గారికి నివేదించి తినేదెప్పుడు? అనే ప్రశ్నే రాలేదు. గురువాజ్ఞను పాటించాలి అనేదే వారి ధ్యేయము. తన ఆకలినే లెక్క చేయకుండా రాజసూయయాగము వద్దకు భిక్షకు వెళ్ళుచున్నాడు.

మార్గమున శ్రీ మాధవదాసు ఇట్లు చింతించసాగెను. "అయ్యో బుద్ధి భూములేలుదమన వ్రాత గాడ్దెల గాయుమనును అనే సామెతగా యున్నది నా బ్రతుకు. జన్మ రాహిత్యము కొరకు గురుసేవ జేసి మంత్రము పొందదలచితిని. కాని నా



దురదృష్టముచే గార్దభములను గాయుచుంటిని, ఆ భగవంతుడు ఈ సామెత నా కొరకే గల్పించెను గాబోలు."

"సద్గురుడు విధి వ్రాత తప్పించునని అనేక మంది పెద్దలు చెప్పుదురు గదా . మరి నాకీ గాడిదల మేపు ఉద్యోగమెలా ప్రాప్తించినది? అయ్యో నేనెంత పాపిని. పెద్దల వాక్యమెన్నడూ అబద్ధము కాదు. అందునా సద్గురువుల మాట ఎట్టి పరిస్థితులలోను వ్యర్థము కాదు" అని పరి పరి విధంబుల తలపోయుచూ పోవుచున్నాడు.

సద్గురువనగా అంతటా తానేయై నిండియున్న పరబ్రహ్మమే. ఈ సద్గురువులు తన భక్తుల కర్మలు క్షాళన చేయుట నాలుగు విధములుగా ఉంటుంది.

1. ఇప్పటి కర్మను భవిష్యత్తులో ఈ జన్మలోనే మరొక రోజుకు మార్చవచ్చు లేక మరొక జన్మకే మార్చవచ్చును.
2. కొండంత కర్మను గోరంతగా అనుభవింప జేసి ఆ కర్మ నుండి విముక్తి చేయవచ్చును.
3. తన యోగశక్తితో పూర్తిగా దహించవచ్చును.
4. కర్మ ఫలితాన్ని స్వప్నావస్థలో అనుభవింప జేసి ఆ కర్మనుండి విముక్తుల జేయవచ్చును.

పై నాల్గు మార్గములలో ఏ మార్గము అవలంబిస్తారనేది మన కర్మల స్వభావాన్ని బట్టి ఉంటుంది. ఉదాహరణకు ఒకడు గ్రామమంతా అప్పులు చేసి ఆ గ్రామం నుండి తప్పించుకొని వెళ్ళిపోతున్నాడు. ఆగ్రామస్థులతనిని కట్టేసి కొట్టబోతున్నారు. అప్పుడు అతని అన్న వచ్చి అయ్యలారా వాణ్ణి కొట్ట బోకండి. వాడి బాకీ డబ్బంతా నేనే కడతానని కట్టేశాడు. అతనిని కొట్టకుండా వదిలేస్తారు.

మరి వాడే ఒకరిని వంటరిగా పట్టుకొని బాగా కొట్టాడు. దెబ్బలు తిన్నవాడు తనస్నేహితులతో చెప్పి ఆ కొట్టినవాణ్ణి కట్టేసి కొట్టబోతుంటే వాని అన్న వచ్చి అయ్యలారా వాణ్ణి కొట్టవద్దు. నన్ను కొట్టండి అంటే వాళ్ళు ఒప్పుకుంటారా? వాడు కొట్టాడు గనుక వాడినే కొట్టాలి. నిన్నెందుకు కొడతామంటారు. మనం చేసే కర్మలు కూడా ఇలాగే గురువు గారి ద్వారా క్షాళనచేయ బడడమో, మరొక కాలానికి మార్చడమో, కొండంతను గోరంతగా అనుభవింప జేయడమో, స్వప్నంలో అనుభవింప జేయడమో అనేది సద్గురువులకే తెలిసి ఉంటుంది. కనుక కోరిన వెంటనే సద్గురువులు కృప చూపలేదని అలిగితే నష్టపోయేది

మనమే.

"అకాలములోనే నచ్చుటికి బోవుచున్నాను. అచ్చుట నా మొరాలకించి సంభావన ఇచ్చే దాతలున్నారో లేరో! ఉండినా గూడా నన్ను నా వేషము చూచి పరిహసింతురో ఏమో" అని మనంబున చింతించుచూ మాధవదాసు ఆకలి పొట్టతో అలసిపోయి అన్నసంతర్పణ జరుగు ప్రదేశమునకు చేరాడు.

అచ్చుట నున్న ద్వారపాలకులతో "అయ్యలారా, నేను ఆకలిచే చాలా అలసిపోయాను. ఇక్కడ ధర్మరాజుగారు అన్నసంతర్పణ చేయుచున్నారని విని వచ్చాను. నేనొక హరిదాసుడను. అన్నార్థినై ద్వారము కడ నున్నానని దయచేసి దాతలకు తెల్పండి" అని విన్నవించాడు.

ద్వారపాలకులీ విషయమును అంతఃపురంబున యున్న విదురునకెరిగించిరి. వెంటనే విదురుడు శ్రీ మాధవదాసు కడకేతెంచి- "అయ్యా మీదేఊరు? ఈదేశంబున కేలవచ్చితివి? మీ దేహము చాలా బడలికతో యున్నది కారణమేమి?" అనిప్రశ్నించెను. "ప్రభూ! నేనెక్కడుంటే అదే నా రాజ్యము, ఉపదేశమే నా దేశము. అనుకూలమే నా కులము, భగవంతుని మతమే నా మతము, మిత్రత్వమే నా గోత్రము. నా సద్గురువుల వారికి సేవలుచేస్తూ దేశమంతా తిరిగాను. ఆ మహనీయుడు సమాధి చెందుటచే దిక్కులేనివాడనై గురుని ఆరాధించుటే దిక్కని ఎంచి నాకు దొరికిన ఆహారమును నా గురుదేవునకు నివేదన గావించి ఆ ప్రసాదమును స్వీకరించి క్షుద్బాధ తీర్చుకొనుచు అక్కడక్కడ తిరుగుచు ఇచ్చట కరుదెంచాను. కనుక నాకు సంభావన ఇప్పించిన నా గురుదేవునకు నివేదన గావించి ప్రసాదము తీసుకుంటాను. త్వరగా దయచేసి నాకు సంభావన ఇప్పించండి ప్రభూ" అని వేడుకున్నాడు. మహా నీతి కోవిదుడైన విదురుండు వెంటనే సంభావన తెప్పించి శ్రీ మాధవదాసు గారికి ఇచ్చి పంపాడు. క్షుద్బాధతో డస్సియున్న దాసుని దుస్థితి జూచి మారుమాట్లాడక వారడిగినట్లు సంభావన వెంటనే ఇచ్చి పంపుటే విదురుని గొప్పదనము. ఆకలిరూపములో అందరిలోనున్న నన్నుగుర్తించు మన్న భగవద్గీత వాక్యార్థమును చక్కగా ఎరిగినవాడు గనుక వెంటనే ఒక్క మాట మాట్లాడక సంభావనలిచ్చి సత్కరించాడు. ఇది మనందరికీ గొప్ప పాఠము.

కులగోత్రాలు, మత సాంప్రదాయాలు, బీద ధనికులనే భేదము, మనిషి యొక్క వయస్సుతోను, బలముతోను సంబంధము లేకుండా ఆకలై కొంగు పట్టిన వారికి అన్నం



పెట్టమన్నారు శ్రీ వెంకయ్య స్వామివారు . బ్రేవ్ మని త్రేపే వారికి కాదయ్యా అని కూడా స్పష్టంగా బోధించారు. నేడు మనమెంత గొప్ప భక్తులమని పొంగిపోతున్నా, మన శుభ కార్యాలలోను, దేవాలయాలలో జరిగే అన్న సంతర్పణలలోను అందరినీ ఒకే పంక్తిలో కూర్చోపెడుతున్నామా లేదా అనేది ఎవరికి వారే చూచుకోవాలి. బీద, బిక్కి, బిక్షగాళ్ళు, వికలాంగులు, ముసలి తనముచే బలహీనులు, రోగ గ్రస్తులను మనము వీరు నిత్యము వస్తున్నారనే మిషతోను, అసహ్యమైన వేషంతో వస్తున్నారనే మిషతోను వాళ్ళందరిని అన్నసంతర్పణలోనికి రానివ్వక పోవడమో లేక మనవాళ్ళంతా భోంచేశాక మిగిలితే వారికంత సాంబారో, చారో వేసి కలిపి పెడుతున్నాము. భగవంతుని గుర్తించే పద్ధతి ఇదేనా అని శ్రీ వెంకయ్య స్వామివారు మన అజ్ఞానానికి నవ్వుకుంటున్నారు. భూమి, సూర్యుడు, గాలి, నీరు, ఆకాశము అనబడు ఐదు రూపాలలో భగవంతుడే ప్రకటమై ఆహారము పండిస్తున్నాడు. కోటానుకోట్ల జీవుల కృషి మూలంగా ఆహారము వస్తుంది. ఆ జీవుల రూపంలో పనిచేసింది భగవంతుడేనని గుర్తిస్తున్నామా? ఇప్పుడు ఆకలి రూపంలో అలసి పోయి మన చెంతకు వచ్చింది ఆ భగవంతుడేనని గుర్తిస్తున్నామా? అందుకే శ్రీ వెంకయ్య స్వామి వారు "ఈ పండేదంతా ఎవరిదనుకున్నావయ్యా" అన్నారు. "అంతా ఆ భగవంతుని సొత్తే. ఆ మాట మరచి మన చేలో పండింది గనుక మనదే ననుకుంటే, ఆకలితో మన చెంతకు చేరిన భగవంతుని తృణీకరిస్తే, మన ధర్మం మనం మరచి పోయామన్న మాటే. ధర్మం తప్పి మనమెంత ఆడంబరమైన వేడుక చేసినా అది మన తృప్తే గాని భగవంతుని తృప్తి పరచలేదు. జాగ్రత్త" అని హెచ్చరిస్తున్నారు శ్రీ వెంకయ్య స్వామివారు. మహనీయుడైన విదురునిచే ఇప్పించబడిన సంభావన తీసుకొనివెళ్ళి, మాధవదాసు గారు ఆ దొమ్మరి గుడిసెల సమీపంబున నొకచెట్టు క్రింద శుభ్రపరచి, నొక గుడ్డ తెరగట్టి, మూడు రాళ్ళను పొయ్యిగానమర్చి, యొక ఆకు దొన్నెలో బియ్యము, పప్పు కడిగిపెట్టి, అందులో కూరగాయలు వేసి, నీరు పోసి, పుల్లలతో మంటవేసి, అన్నము వండి నైవేద్యము సిద్ధము చేసెను.

ఈ విధముగా ఆకు దొన్నెలో బియ్యము నీరు ఉంచి రాళ్ళపొయ్యి మీద మంటవేసి ఉడికించుట మానవమాత్రులకు సాధ్యమయ్యే పనికాదు. ఆకు దొన్నెలో నీరు నిలుచుట సాధ్యమా? పొయ్యి మంటవేసినపుడు ఆకు దొన్నె కాలిపోదా? ఈ అద్భుతము శ్రీ మాధవదాసు గారి గొప్పదనము తెల్పుచున్నది. కానీ ఆ మహనీయుడు అదంతా తన గురు

మహిమే యనుకొనుచున్నాడు కానీ తన మహిమ, తన గొప్పదనమని కించిత్తు కూడా తలచడం లేదు. దీనినే శ్రీ వెంకయ్య స్వామి వారు సంపన్నత్వం సాధారణత్వం సహజ సిద్ధమవడమన్నారు. నేటి నకిలీ గురువుల సామర్థ్యము చూచి భ్రమించే మనకిది యొక గొప్ప నిదర్శనము. శ్రీ మాధవదాసు గారు గుడ్డ తెర అడ్డం కట్టి తాను వంట చేసే పద్ధతి ఎవ్వరూ ఇతరులు చూడకుండా జాగ్రత్త పడుచున్నారు. నేటి నకిలీ గురువులైతే ఈ వంట చేయడం గొప్ప ప్రదర్శనగా తన భక్తులకు చూపించే వారు.

శ్రీ రాఖాడి బాబా గారు శ్రీ పూర్ణానంద స్వామి వారికి అన్నం పెట్టవలసి వస్తే పొగలు కక్కే ఆ అన్నాన్ని అక్కడున్న బండల చాటు నుండి తీస్తారు కానీ ఆ విషయం శ్రీ పూర్ణానంద స్వామి వారికి కూడా తెలియనివ్వరు. శ్రీ సాయినాథుడు తనకు ఆ రోజు వచ్చిన దక్షిణ ఇరువై రూపాయలే అయినా ఆ రోజు షుమారు ఐదు వందల రూపాయలకంటే ఎక్కువ ధర్మం చేసేవారు. ప్రతి దఫా తన జేబు నుండి తీసి ఇచ్చేవారే కానీ తన చేతిలో నోట్లను సృష్టించి చూపలేదు. కరచాలనంతో వస్తువులు సృష్టించడం చాలా హీనమైన పని అని అలాంటి మహిమలు చేసే వారిని నమ్మరాదని పెద్దల వాక్యము. గుడ్డతెర అడ్డం కట్టి తన గురువు గారు తన కనుగ్రహించిన మహిమను శ్రీ మాధవదాసు గారు ఎంత చక్కగా మన కంట్లో పడకుండా దాచేస్తున్నారో చూడండి. ఇలాంటి విషయాలద్వారా నకిలీ గురువులను గుర్తించమంటున్నారు శ్రీ స్వామి వారు.

ఆ విధంగా తయారు చేసిన భోజనాన్ని హృదయపూర్వకంగా తన గురువు గారికి నివేదించి, భగవంతునికి మదిలోనే కృతజ్ఞతతో నమస్కృతులర్పించి మొదటి ముద్దను నోట బెట్టు కొనెను.

ఆ ఇంద్రప్రస్థపురంబున రాజసూయయాగము చేయుచోట ధర్మరాజు గారు శత సహస్ర (లక్ష) నాలుక లేని గంటలు కట్టియున్నాడు. యాగము మొదలు పెట్టిన నాటి నుండి శత సహస్ర (లక్ష) బ్రాహ్మణ్యంబు భుజించినపుడు ఒక్క నాలుకలేనిగంట టంగు మని మ్రోగుచుండెను. కానీ ఈ రోజు నిమిష నిమిషంబునకు భూమ్యాకాశంబులు దద్దరిల్ల గంటలన్నియు మ్రోగసాగెను.

వెంటనే ధర్మరాజు సభజేసి భీమార్జున నకుల సహదేవులు, భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామ, కర్ణ, వికర్ణాది సర్వులను ఉద్దేశించి ఆశ్చర్యంబుతో 'ఓ మహానుభావులారా ఈ గంటల శబ్దము విన్నారు గదా! శతసహస్ర (లక్ష) బ్రాహ్మణ్యంబు భుజించగా ఒక్క నాలుక



లేని గంట టంగ్ మని మ్రోగెడిది. కానీ నేడీ శబ్దములేమిటి? నేటి కాలంబునకు ఏ మహానుభావుని వల్లనో నా యోగంబు సిద్ధించెను. అయినను ఇది భోజన సమయము కాదు గదా? ఈ దినమున మన ఊరిలోనికి మహనీయులెవరైనా వచ్చి సంభావన కొరకై అర్థించారా?' అని అడుగగా విదురుండు లేచి సంతోషంబుగా ఈ విధముగా చెప్ప దొడంగెను.

"నేను విశ్రాంతి తీసుకొను సమయంబున అకాలముగా నొక మహనీయుడు ఆకలితో డస్సిపోయి వచ్చాడు. గురువు గారి ఉపదేశమే నాదేశము. నేనెక్కడుంటే అదే నా రాజ్యము. నేను ఆకలితోనున్నాను సంభావన కావాలన్నాడు. నేనన్నమే పెడతాను తినమంటే నేనలా తినకూడదు. నాగుర్వాజ్ఞమేరకు నేనే స్వయంపాకము చేసుకొని గురువుకు నివేదన సల్పి వారి ప్రసాదముగా స్వీకరించాలి గనుక సంభావన ఇప్పించమని అడిగారు. నేను సంభావన ఇప్పించాను. ఆ మహనీయుడు సంతోషముగా సంభావన తీసుకవెళ్ళాడు. ఈ గంటల మ్రోత అంతయు ఆ మహనీయుని మహిమే" అని తెల్పెను.

అప్పుడు ధర్మరాజుగారు కొందరు భటులను పిలచి ఈపట్టణమందున అన్ని దిశల యందును శోధించి నేను హరిదాసుడను అని చెప్పిన వారిని చూచి అచ్చట నతడేమి చేయుచున్నాడో చూచి వచ్చి నాకు చెప్పవలెను. వేగిరమే వెళ్ళి వెదకండి అని పంపెను.

ఆ భటులు నలుమూలలా వెదకుచు చివరకు పట్టణము చివర దొమ్మరి గుడిసెల సమీపమున గుడ్డతెర అడ్డముగా గట్టి ఏమో చేయుచున్న ఒకరిని జూచి ఆ దొమ్మరి పడుచుల ప్రశ్నించారు.

"మీరెవరు? ఏదేశము? ఆ చెట్టు క్రింద తెరచాటున ఏమో చేయుచున్న వాడెవడు. ఏమి చేయుచున్నా"డని ప్రశ్నించిరి.

"అయ్యా! మాది నేపాళ రాష్ట్రము. దేశదేశము తిరిగే ఈటెలవారము. తీగపై నాట్యము చేయుట మా వృత్తి. ఆ చెట్టు క్రింద తెరచాటున నున్న వారు మా గాడిదల మేపు దాసుడు. ఈ రోజు అకాలముగా రాజు గారి అన్న సత్రములో సంభావన తెచ్చుకొని స్వయంపాకము చేసుకొని గురువునకు నివేదన చేసి ఆ తెర చాటున భోంచేయుచున్నాడు. అతడెప్పుడూ శ్రీహరి సంకీర్తనములో మునిగి యుంటాడే తప్ప మాతో కలిసి మాట్లాడడు. ఆ చెట్టు క్రిందనే పడుకుంటాడు" అని చెప్పారు.

అంతట నా భటులు తెర దగ్గరకు వెళ్ళి మాధవదాసు గారిని ఇచ్చట నీవేమి

చేయుచున్నావని అడుగగా నేను భోంచేయుచున్నానని చెప్పగానే ఆ రాజభటులు వేగముగా వెళ్ళి ధర్మరాజునకీ విషయము తెల్పిరి.

"ఓ మహారాజా! అక్కడొక మహనీయుడున్నాడు. అతడు అన్నము తింటున్నాడు. అతడు ముద్ద తిను నప్పుడంతా ఇచ్చట మన గంటలు దద్దరిల్లి మ్రోగుచున్నవి. ఆ మహాపురుషుడు అక్కడున్న దొమ్మరి వారి గాడిదలను మేపుతాడట నిత్యము తానే తెరచాటున స్వయంపాకము చేసుకొని గురువునకు నివేదించి తింటాడట. సదా హరికీర్తన చేయుచు ఆ చెట్టు క్రిందనే విశ్రమిస్తాడట. ఆ దొమ్మరివారితో ఎక్కువగా మాట్లాడడట. వారి యొద్ద మూడు నెలల నుండి గాడిదల మేపుచున్నాడట" యని ఎరిగించిరి.

అది విని ధర్మరాజు  అనేక దినముల నుండి మనము బ్రాహ్మణులకు అన్న దానము చేయుచున్నాము. కొన్ని నాలుక లేని గంటలైనా ఈ విధముగా మ్రోగలేదు. ఈనాడీ విధముగా భూమి బ్రద్దలగునట్లు నాలుక లేని గంటలు మ్రోగుచున్నవంటే అది ఆ మహనీయుడు భోంచేయుట వల్లనే యని తెలియుచున్నది. వెంటనే బంగారు పల్లకిలో ఆ మహానుభావుని సగౌరముగా ఇచ్చటకు తీసుకరండి యని ఆజ్ఞాపించెను.

వెంటనే నకుల సహదేవులు, విదురుడు మొదలైన వారంతా బంగారు పల్లకిని  పచ్చల తోరణంబులతోను, ముత్యాల హారంబులతోను, వివిధ రకముల పుష్పమాలికలతోను అలంకరించి వింత వాద్యనాదంబులతో తీసుకు వెళ్ళి మాధవదాసు గారికి సమీపమున నున్న చూత వృక్షము క్రింద దించిరి. ఈ వింతను చూచుటకు అక్కడున్న దొమ్మరి స్త్రీ పురుషులే గాక అనేక మంది గ్రామస్తులునూ కూడిరి.

వీరెవ్వరో వివాహమహోత్సవము చేసికొన వెడలుచు ఇచ్చట విడిది దిగినారు గాబోలని శ్రీ మాధవదాసు గారు తనలో తల పోయుచుండెను. రాజభటులు చూపెట్టినందున నకుల సహదేవ విదురాదులు మాధవదాసు దగ్గరకు వెళ్ళి వారికి పాద నమస్కారములు చేసిరి.

అది చూచి శ్రీ మాధవదాసు "అయ్యలారా మీరు రాజవంశీయులుగా నున్నారు. నేను నీచుడను, దుర్మార్గుడను గాడిదల మేపు అల్పుడను. దేవునకు మ్రొక్కినట్లు నాకు మ్రొక్క దగునా? ఎవ్వరనుకొని నాకు పొరపాటున నమస్కరిస్తున్నారో? ప్రభూ! నన్ను క్షమించండి" యని వినయముతో ప్రార్థించాడు.

అందులకు విదురుండు "ఓ మహానుభావా! మా ప్రభువు గారైన ధర్మరాజు గారు మిమ్ములనుసేవించాలనే ఆనందముతో ఈ బంగారు పల్లకిలో మిమ్ములను కూర్చుండ బెట్టి



సగౌరవంగా తీసుకురమ్మని మమ్ములను పంపినారు. గనుక మాపై దయతో తమరు రాజభవనమునకు రావలసినదిగా మేము వినయముతో ప్రార్థించుచున్నాము" అని పల్కెను. అంత నకుల సహదేవులతో సహా అందరూ వారికి పాద నమస్కారము లొనర్చిరి.

"నేను పాపిని, మూఢుడను, గాడిదల మేపు మూర్ఖుడను. నాకేల ఈ రాజ లాంఛనములు. నేనే యపరాధము చేయలేదు. మీ రిచ్చిన పదార్థము వండి నా గురువునకు నివేదించి ఇప్పుడే ఆ ప్రసాదము భుజించితిని. దయచేసి నన్నొదలి వేయండి" అని ప్రార్థించాడు.

ఎంత బ్రతిమాలిననూ శ్రీ మాధవదాసు గారి ప్రార్ధన విదురుడు విననందున, "అయ్యా నాలాంటి హీనుండు, పాపి యగువాడు రాజులు ఎక్కవలసిన పల్లకిలో కూర్చుండ తగదు. నేను నడచి వస్తాను పదండి" అని వారి తోటి రాజసభకు నడచి పోతున్నాడు.

నేటి నకిలీ సాధువులకు శ్రీ మాధవదాసు గారికి గల వ్యత్యాసము మనము బాగా గమనించాలని శ్రీ వెంకయ్య స్వామి వారు ఈ చరిత్రను చదివించుకొని విని శరీర త్యాగం చేశారు. శ్రీ వెంకయ్య స్వామి లాంటి మహనీయులు రాజ లాంఛనములు ఎంత గొప్పగా దూరం చేశారో నేటి నకిలీ సాధువులు వాటిని ఎంత గొప్పగా అభిమానించి కౌగలించు కొనుచున్నారో మన మిచ్చట గమనించాలి. ముద్ద ముద్దకూ నాలుక లేని గంటలు మ్రోగించ గల శ్రీ మాధవదాసు గారు పల్లకి ఎక్కక నడచి పోతున్నారు. మరి మన నకిలీ గురువు లెలా ఉన్నారో యోచించండి. మీరు గొప్ప మహానుభావులు స్వామీ అని విదురుడంటే, కాదయ్యా మీరు పొరపాటు పడ్డారు నేను గాడిదల మేపు మూర్ఖుడను అంటున్నారు. కాని మన నకిలీ గురువరేణ్యులు స్వయంగానే ప్రచార సాధనాలు వాడడం కలిమాయ గదా! ఎంతటి ధన మదాంధులు వచ్చి తమ గృహమున కరుదెంచమని ప్రాధేయపడి కార్లుతెచ్చి పెట్టినా దోవలో ముండ్ల మండలు బిగించి పెట్టారు దోవ కనిపించడం లేదని వారి విన్నపమును తిరస్కరించే వారు శ్రీ స్వామి వారు. మరి మన నకిలీ గురువులు కార్లు లేనిదే కదలలేరు. ఇది మనలను గమనించ మంటున్నారు శ్రీ స్వామి వారు.

శ్రీ మాధవదాసు గారు  ఆ విధంబుగా బంగారు పల్లకి వెంబడి నడచి పోవుట చూచిన దొమ్మరివారు "నేడు మనదాసుడేదో నేరము చేశాడు. రాజభటులు తీసుక పోతున్నారు" అని కొందరంటే, మరి కొందరు ఈటెలసానితో "అమ్మా మన దాసునకు రాజ కుమారులందరూ పాద నమస్కారము చేశారు.  వారెంతటి గొప్ప వారో గదా! మనము

దాసుని గొప్పదనము గుర్తించ లేక పోయా"మని వాపోయారు.

అంతట ఈటెలసాని "అయ్యో దాసుడింతటి పుణ్య పురుషుడని నేనెరుగనైతిని గదా. ఎంతటి పాపినో తెలివి లేని దానినై ఆ మహనీయుని చాలా హీనునిగా చూచిన ఘోర పాపినైతినే. అసలీ దాసుడు మహనీయుడని వారికి ఏ విధముగా తెలిసింది? మనకిక దాసుని జూచు భాగ్యమున్నదో లేదో గదా" యని వగచెను. ఆ మహనీయుని రాకకై ఎదురు చూచుచున్న ధర్మరాజు తన సభాజనులతో మాధవదాసు గారికి ఎదురేగెను. నడచి వచ్చుచున్న మాధవదాసును జూచి వడివడిగా వెళ్ళి దాసును కౌగలించుకొని పాదాభివందనమాచరించి ఆ మహనీయుని ఎత్తుకొని పల్లకిలో కూర్చుండ బెట్టెను. వారికి బంగారు పోగులతో చేసిన శాలువ గప్పి తానే స్వయముగా వింజామర వీచుచూ ఆ మహాభాగుని బంగరు పల్లకిలో తీసుకొని రాసాగెను.

తాను ఊహించకయే జరుగుచున్న ఈ మర్యాదలను జూచి శ్రీ మాధవదాసు గారు ఇట్లు చింతించ సాగెను. "హే కృష్ణా, పుండరీక వరదా! ఇది ఏమి ప్రారబ్ధము తండ్రీ! నన్ను పల్లకి ఎక్కించి ఊరేగించుట ఏమిటి! ప్రభూ నీ చింతన చేసి ప్రార్థించినది ఈ సౌఖ్యముల కొరకా? మూఢులగు జనులు కోరు ఈ సౌకర్యములు మానవుడు చని పోయాక కూడా వచ్చునా ఏమి? తిరుమంత్రము నిప్పించమని నే జేసిన ప్రార్థనలకు ప్రతి ఫలమిదియా? నిత్య సుఖానంద దాయకమగు మార్గము నే గోరితిగాని ఈ మాయ సుఖములు నాకెందులకో ప్రభో!" యని వగచుచున్న దాసుని జూచి ధర్మరాజు ఇట్లనెను. "ఓ మహనీయా! నీలాంటి మహనీయుల సేవచే మా బోటి వారి సర్వ పాపములూ హరించునని శాస్త్రములు చాటుచున్నవి. నీవంటి శ్రీహరి పాద భక్తులను సేవించక మాకు మోక్షమెట్లు గల్గును" అని పల్లకితో గూడ నడచి వచ్చుచుండెను.

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రాదులు, ఋషులు వేలకొలది భటులు భజనలతోను జయ జయ ధ్వనులతోను శ్రీ మాధవదాసు గారి పల్లకి ఆ పట్టణ వీధులలో పోవుచుండెను.

ఆ పట్టణ జనులందరు మిద్దెలపైనెక్కి ఆ మహోత్సవమును నేత్రోత్సవంబుగా జూచుచూ ఆశ్చర్యముతో నిట్లను కొనుచుండిరి.

"ఈ మహనీయుని మహిమ ఎట్టిదో గాని నాలుకలేనిగంటలన్నియు వీరు భోంచేయునప్పుడు ఒక్క సారిగా మ్రోగినవి. ఈ మహనీయుడు చేయు భక్తి యోగమేమో గదా!" అంతరిక్షమున దేవతలందరూ వింతగా ఈ మహానుభావునికి జరుగు ఉత్సవమును



జూచుచూ పూలవానలు గురిపించు చుండిరి. ఆ మహనీయుని పల్లకి దించగనే మరొక్కసారి నాగవాసంబులు లేని గంటలు దిక్కులు పిక్కటిల్లగా మ్రోగ సాగెను.

శ్రీ మాధవదాసు గారికి తన గురువు గారి నుండి పొందవలసిన మంత్రమే చిక్క లేదు. ఒక్క సారైనా ఆ మంత్రమును తన నోట పల్కలేదు. మరి ఈ నాలుక లేని గంటలను మ్రోగించు సామర్థ్యము ఎట్లు వచ్చినది. మనము ఈ విషయము బాగా యోచించ వలసి యున్నది. ఈ సమస్యకు పరిష్కారము భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి వారే చెప్పి యున్నారు.

" మంత్ర మెక్కడుంది తంత్ర మెక్కడుంది. చూచు కుంటూ పొయ్యేదే గదయ్యా"

అన్నారు. ఈ మాట అక్షర సత్యమని శ్రీ మాధవదాసు గారి చరిత్ర నిరూపిస్తున్నది. శ్రీ జ్ఞానేశ్వర మహరాజ్ గారు కూడా ఈ మాటనే చెపుతారు. శ్రీ సాయి నాథుడు, శ్రీ భరద్వాజ మాష్టరు గారు కూడా ఇదే చెప్పారు. మంత్రం కంటే ముందు మన అంతరంగాన్ని శుద్ధిచేసుకో మని చెపుతున్నారు. అంతరంగం శుద్ధిగాక ముందు చేసే సాధనలన్నీ భాండ శుద్ధి లేని పాకమవుతాయి. అంతరంగ శుద్ధి గల్గి నప్పుడు గురువు తనకై తానే సాధకునకు దర్శనమిస్తారు. శ్రీసాయినాధునికి వారి గురువు దర్శనమిచ్చి అనుగ్రహించినట్లు, శ్రీభరద్వాజ మాష్టరు గారికి సాయి దర్శనమై అనుభూతి కల్గి ఐదు గంటలు వారితో ఐక్యమైనట్లు ఉంటుంది. శ్రీ అనంతాచార్యుల వారికి సాయి దర్శనం లభించినట్లు ఉంటుంది.

అందుకే శ్రీ వెంకయ్య స్వామి వారు " మంత్ర మెక్కడుంది తంత్ర మెక్కడుంది. చూచు కుంటూ పొయ్యేదే గదయ్యా" అని చెప్పడమే గాక భగవద్దర్శనము కోరిన వారికి శ్రీ బ్రహ్మంగారి చరిత్ర చదవమని చెపుతూ తాను శ్రీ మాధవదాసు గారి చరిత్ర చదివించుకొని విని శరీరం చాలించారు. శ్రీ బ్రహ్మంగారి చరిత్రలో సిద్ధయ్య గారి అంతరంగం శ్రీ మాధవదాసు గారి అంతరంగం వలె పరిశుద్ధమై యున్నది. ప్రాపంచికమైన ఏ ఇతరంబును కోర నొల్లని మనస్సు, తన గురుని ఆదేశము నెరవేర్చుటకు తన ప్రాణముల సహితము సమర్పించుటకు సంసిద్ధతయు గల అంతరంగములు గల్గి యున్నారు. ఇదే మనము శ్రీ గురు చరిత్రలో బైధుడు, అరుణి, ఉపమన్యువులలో చూస్తాము. నిజమైన సాధకులకు శ్రీ వెంకయ్య స్వామి వారి మాట అమృత తుల్యము గదా! అందుకే పోలిరెడ్డి, రోశిరెడ్డి, తులసమ్మ, వక్కెమ్మ, నరసమ్మలను ఆ మహనీయుడు బ్రోచి రక్షించాడు. వారికి

శ్రీ స్వామి వారు ఏనాడూ మంత్రోపదేశము చేయలేదు. వారికి శ్రీ స్వామి వారి ఆదేశములు ఆచరించడం తప్ప మరే శాస్త్రములు తెలియవు. మనలను గూడ మంత్ర సాధన కంటే ముందు అంతరంగ పరుశుద్ధికై పాటు పడమని బోధించుటకే శ్రీ స్వామి వారు శ్రీ మాధవదాసు గారి చరిత్ర విని శరీరం వదిలారు.

ఈ విధంబుగా శ్రీ మాధవదాసు గారి ఊరేగింపు పుర వీధులలో బోవుచుండ వారి పల్లకికి శ్రీ బలరామ కృష్ణులు ఎదురుగా వచ్చిరి. వారిని చూడగానే శ్రీ మాధవదాసు గారు పల్లకి దిగి శ్రీ కృష్ణుని పాదముల పైబడి నమస్కరించుచూ ఇట్లు స్తుతించెను.

"హే దివ్యావతార, జగములన్నియు నీ యుదరమున ధరించి బొమ్మలాట జూపు విధంబున పాలించుచున్న హే పరాత్పరా! కడు దుర్లభమైన నీ దివ్యరూపంబును నేడు కన్నులారా గాంచగల్గితిని. నా కోరిక తీర్చి రక్షించుమమో భవభయహరణా! వేద పురాణములు నిన్ను వర్ణించలేవు. బ్రహ్మాదులు నిన్ను కనలేరు. ఈశ్వరునకు కూడా నీ మహిమ తెలియరాదు" అని స్తుతించుచున్న మాధవదాసుని శ్రీ కృష్ణుడు చేతులు పట్టి లేవనెత్తి, కౌగలించుకొని సభామందిరమున నిలుచొని ఇట్లు చెప్పసాగెను. "ఓ ధర్మరాజా నీ యోగము పండింది. ధన్యుడవైనావు గనుకనే నీకీ మహనీయుని సేవా భాగ్యము కల్గినది.

తిరువణితో చక్కగా నామములు ధరించి తిరుమంత్ర మెరుగకున్న లాభమేమి? మానవుడై పుట్టి మోక్షమార్గమే తెలియకున్న వాడొక మానుతో సమానమే. వైష్ణవుడై కూడా జాతిని వదలని వాడు వ్యర్థుడు. కుల గోత్రములు గల వారము మేమే గురువులమని చెప్పుకొనుచున్నంత మాత్రమున గురువులవుతారా? మోక్ష కాంక్షలేక, ఆశవీడక సుజ్ఞానులౌతారా?

ఓ ధర్మరాజా! పరమాత్మ నిజమైన హరిదాసుల హృదయమునందును, జిహ్వాది ఇంద్రియములందును వేంచేసి యుండి అన్నము మొదలైన పదార్థముల ననుభవించుచు సంతుష్టుడై యుండును. కావుననే ఈ మహానుభావునకు ఒక్క పూట భోజన సామగ్రి ఇచ్చినంతమాత్రమున శతసహస్ర నాగవాసంబులు లేని గంటలు భూమ్యా కాశములు బ్రద్దలగునట్లు మ్రోగినవి. ఈపుణ్యాత్ముని షోడశోపచారంబులచే పూజించి వారి పాదతీర్థ ప్రసాదంబులు గ్రహించిన వారికెట్టి మహత్తు గల్గునో యోచింపుము" అనిపలికెను. వెంటనే ధర్మరాజు ఆ మహా భక్తాగ్రేసరుని కనకమయ సౌధమంటపంబున రత్నపీఠంబున కూర్చుండబెట్టి సాష్టాంగ దండప్రణామము లాచరించి ద్రౌపదితో ఆ మహానుభావునకు



అభ్యంగన స్నానము చేయించమని తెల్పెను.

శ్రీకృష్ణుడు మొదట ఆ మహానుభావుని శిరముపై సంపెంగ తైలము నుంచెను, ఆపై ధర్మరాజు, సప్త మహాఋషులు, సప్తాంగనలు ఆ మహనీయునికి సంపెంగ నూనె పూసిరి. సీకాయ పిండితో ద్రౌపది మరియు ఆమె చెలికత్తెలు వళ్ళురుద్ది పన్నీట స్నానమాడించి తడిమొత్తి పట్టుబట్టలు కట్టబెట్టిరి. అనసూయ, అరుంధతీ, అహల్యాది సప్తాంగనలు కురులు దువ్వి తిలకము దిద్దిరి. సుగంధ లేపనములు పూసిరి. అప్పుడు బలరామ కృష్ణులు ఆ మహనీయునికి నైవేద్య నీరాజనములిచ్చి తీర్థ ప్రసాదములు స్వీకరించి సభికులందరికీ ఇప్పించిరి.

అప్పుడు ధర్మరాజు ముకుళిత హస్తుండై వినయముగా నిట్లు చెప్పెను. "ఓమహాను భావా! వ్యర్థముగా నేనీ సిరి సంపదలకు విర్ర వీగుచుంటిని. నేనేలెడి రాజ్యమంతయు మీకు సమర్పించి, ఎల్లప్పుడు మీకు సేవ చేయుచుందును. ఇంతటి మహనీయులైన మీరేల ఆ ఈటెలసాని కడ గాడిదెల మేపుచుంటిరో తెలియకున్నది" యనిపలికెను.

అప్పుడు శ్రీ మాధవదాసు ఇట్లు చెప్పసాగెను."ఓ ధర్మరాజా! వాసనాత్రయంబుతో గూడిన ఈ మాయాప్రపంచంబును మిధ్యగా దలచి మనోవాంఛలు విడిచి జన్మరాహిత్యంబునకు ప్రయత్నించు వారల కేల ఈతుచ్ఛభోగంబులు. సద్గురుని సన్నిధి జేరి వారికి సేవలు జేయుచు ఆ మహనీయుని పూజించుట కంటే భాగ్య మేమున్నది. నేను పండ్రెండు సంవత్సరముల ప్రాయమున సద్గురుని అన్వేషించుచూ ఇల్లువదలి తిరుగుచుంటిని. నాపూర్వపుణ్యము వలన హరిద్వారములో త్రిమూర్త్యాత్మకుడు, శుద్ధ సత్యుండును, జ్ఞాన పూర్ణుండునైన సద్గురువును చేరితిని. వారికి సేవలు చేయుచు కాలి నడకన వారితో దేశమెల్ల తిరిగితిని. ఎన్నో సద్గోష్ఠులలో పాల్గొంటిని. ఎందరెందరో మహనీయుల సేవించు కొనుచూ పోవుచుంటిమి. ఆ మహనీయుడు బడలికచే నడువలేనప్పుడు నాభుజము పై ఎత్తుకొని ప్రయాణము చేసితిని. ఒకరోజు మేము ఒక ఘోరారణ్యంబున పోవుచుండ నా గురువర్యునకు దాహం బతిశయించగా వారు త్రాగుటకు నీళ్ళడిగిరి. మాయొద్ద నీరు లేని కారణంబున ఆ మహనీయుని ఒకవృక్ష ఛాయలో గూర్చుండబెట్టి నీరుదెచ్చుటకు వెళ్ళితిని. ఎంత దూరము వెళ్ళి వెదకినను నీరు కానరాదయ్యె. అట్టి తరి గగనమునందు పోవుచున్న రాయంచలను నీరున్న తావు దెల్పుడని అర్థించితిని. నా గురుకృపచే ఆ హంసలు నాకు గొడుగువలె నీడబట్టి దారి చూపి

నీరు చూపినవి. నేను వెంటనే జల కలశముతో నాగురుని చేరుసరికి నా దురదృష్ట వశమున వారు సమాధి చెంది యుండిరి. కానీ ఆ కరుణామయుడు నాకు చేయవలసిన మంత్రోపదేశము భూమిపై వ్రాసి పోయెను. కానీ విధివశమున ఆ మంత్రము నెవరో చెరిపి వేసియుండిరి. దిక్కులేని వాడనై గురువు లేక మంత్రము లేక ఘోరముగా దుఃఖించు సమయంబున ఆ శ్రీహరియే ఒక పశువుల కాపరి పిల్లవానిగా కన్పించి 'ఈ మార్గమున నొక ఈటెలసాని పోవుచూ ఆ మంత్రమును తాటాకుపై వ్రాసుకొని భూమిపై నున్న ఆ మంత్రమును చెరిపివేసి వెళ్ళినది. నీవు త్వరగా వెళ్ళి ఆమెను కలుసుకొని తగిన సమయము చూచి ఆ మంత్రము అడిగి తీసుకొన'మని చెప్పి అంతర్థానమయ్యెను. నేను నా గురుని కళేబరమును భూస్థాపితము చేసి, ప్రార్థన చేసుకొని వచ్చి ఆ ఈటెలసాని కడ గాడిదల కాయు పనిలో చేరి మూడు నెలలుగా ఆమె సేవలో ఉన్నాను. నేనామెనడిగిన ఆమె యా మంత్రమిచ్చునో లేదో యను అనుమానముతో కాలయాపన చేయుచున్నాను. రాజేంద్రా నాకా మంత్రమిప్పించిన ఈ భూమండలమంతా ఇప్పించిన పుణ్యము మీకు కలుగును. దయచేసి యా మంత్ర మిప్పించు మార్గము ఆలోచించు"మని వేడుకొనెను.

'ఓ మహనీయా! ఆమంత్రమును ఎచ్చట భద్రపరచి యున్నదో తెలియ జెప్పిన మన పని సులభమగు'నని ధర్మరాజు పలికెను. శ్రీ మాధవదాసు:- "రాజేంద్రా! ఆమె యా మంత్రంబును తాటి యాకుపై వ్రాసి తన చెవులలో ధరించి యున్న"దని తెలిపెను.

వెంటనే ధర్మరాజు బంగారు పని వానిని బిలిపించి నవరత్నములమర్చిన బంగారు కమ్మలు తెప్పించెను. తన రాజ భటులను పంపి ఈటెలసానిని పిలిపించెను.

'అమ్మాయి! నీవు చాలా చక్కగా గడపైన ఆడెదవని విన్నాము. ఈ సభలోని పూజ్యులందరూ మెచ్చి ఆనందించునటుల ఆడి మాకానందము కల్గించుము' అని పలికెను. వెంటనే ఆ ఈటెలసాని పాట పాడుచూ తన ఆటను ప్రారంభించెను. పాదములకు గజ్జెలు గట్టి, సభలో నందరికీ నమస్కరించి అడ్డము గట్టిన గడపై దుమికి గడపై మొగ్గ వ్రాలెను. కమ్మిపై చేత గొడుగు పట్టి నృత్యము చేయ సాగెను. అప్పుడు ధర్మరాజు 'ఓ అమ్మాయి! నీ ఆట మెచ్చితిని. ఈ నవరత్నములు పొదిగిన కమ్మలను ఎగుర వేయుచున్నాను. వాటిని పట్టుకొని ఆ కమ్మిపైననే చెవులకు పెట్టుకోవాలి' అని చెపుతూ కమ్మలను పైకి ఎగుర వేసెను. ఆ ఈటెలసాని బహు లాఘవంబుగా ఆ కమ్మల పట్టుకొని తన చెవులలో నున్న తిరు మంత్రపు చీట్లు భూమిపై పడవైచి నవరత్న కమ్మలను చెవులకు ధరించెను. అప్పుడు



ధర్మరాజు వడివడిగా నా తిరు మంత్రపు చీట్లను తీసుకొని కనుల కద్దుకొని దాసునకొసగెను. అది గాంచిన దేవతలందరూ భూమిపై పుష్ప వర్షము గురిపించిరి. ధర్మజుడు శ్రీ మాధవదాసు గారి పాదముల బట్టి నమస్కరించెను. ఈటెలసానికి కోరిన ధనమిచ్చి సత్కరించెను.

తిరుమంత్రపు చీట్లు దొరకగనే శ్రీ మాధవదాసు ఆ సభా మద్యంబున అమిత సంతోషముతో నృత్యము చేయుచు ఆ మంత్ర రాజంబును గూర్చి ఇట్లు పాడ సాగెను.

"మధురమైన పదార్థముల కంటె నోటికి రుచియైన శ్రీమన్నారాయణ మంత్రము దొరికింది. ఘోరాతి ఘోరమైన నా పాతకములన్నీ భస్మమై పోయినవి. చక్కెర, తేనె, పండ్ల కంటె మిక్కిలి రుచియైనది లభించింది. చావు పుట్టుకలు లేని మోక్షము జూపు పావన మంత్రమిది. విరాట్ పురుషుడు బ్రహ్మదేవున కిచ్చినది. వశిష్ట మహాముని శ్రీ రామున కిచ్చినది. శ్రీరాముడు హనుమంతున కిచ్చినదీ మంత్రమే. ఋషులందరూ ఆనందముగా భజించునదీ మంత్రమే. శ్రీ కృష్ణుడు అక్రూరున కిచ్చినది, శుకయోగి పరీక్షిత్తున కిచ్చినది, నారదుడు ప్రహ్లాదున కొసగినదీ మంత్రమే" యని ఆనందంబున గంతులు వేయుచున్న శ్రీ మాధవదాసు గారి పాదములు పట్టుకొని ఈటెలసాని మిక్కిలి దుఃఖించుచూ "ఓ స్వామీ! మీరింత గొప్ప వారని ఎరుంగక మీచే గార్దభముల గాయించి మిక్కిలి పాపము గట్టుకొంటిని. తమరప్పుడే అడిగి యున్న ఆ తిరు మంత్రపు చీటి ఇచ్చి యుందు గదా స్వామి. నేను తెలియని దాననై భాగవతుల కపచారము గావించాను. నా దోషములు క్షమించి పాలించు" మనుచు కంట తడి పెట్టెను. "అమ్మా! నిన్నూ నన్నూ సర్వ జగత్తును రక్షించు ప్రభువు శ్రీ కృష్ణ పరమాత్మ ఒక్కరే. మీరు ఆ మహనీయుని పాదములను వదలక పట్టండి. నా చేత గాడిదల కాయించితినను బాధను వదలండి. నిజమైన గాడిదలెవరో చెపుతాను వినండి" అని ఇట్లు చెప్పసాగెను.

"సద్గురుని సేవ జేసి వారి కృప పొందిన దొక్కటే ఆడది. అట్లు గాక సత్తు, చిత్తుల నెరుగక విర్రవీగునదె గాడిద. అత్త మామలకు సేవజేయునదే ఆడది. అట్లు గాక అత్త మామల కొట్టపోవునదే గాడిద. సిరి సంపదలు కలిగి నప్పుడు సర్వ జనులను ఆదరించునదే ఆడది. తన సిరి సంపదలను జూచుకొని ఇతరులకు కీడు చేయునదే గాడిద. పెద్దలను పూజ్య భావముతో చూచునదే ఆడది. పెద్దలను, భక్తులను తిరస్కార భావముతో చూచునదే గాడిద. తన భర్తకు తలలో నాల్కయై మెలంగునది ఆడది. భర్తతో పోట్లాడునదే గాడిద. ఆకలై కొంగు

పట్టిన వారికి తన శక్త్యాను సారము ఆకలి తీర్చునది ఆడది. ఇతరుల ఆకలి చూడక తన గుమ్మములో కొచ్చిన అతిథిని తరిమేసేదే గాడిద. నిజమైన సాధువులను, బీదవారిని శక్త్యాను సారము ఆదరించునది ఆడది. ఆదరణ లేకపోగా కటువైన మాటలతో బాధ పెట్టునదే గాడిద. సద్గోష్ఠులలో మంచిని గ్రహించి ఆచరించేదే ఆడది. మంచిని గ్రహించ లేక పెద్దలను తిట్టి పోయునదే గాడిద. తన అంతః శత్రువులైన అరిషడ్వర్గములపై దాడి చేసేది ఆడది. నిష్కారణంగా ప్రతి వారితో తగాదా పడేదే గాడిద. భర్త మాట శిరోధార్యముగా మెలగునది ఆడది. భార్యా భర్తలకు తగాదా పెట్టునదే గాడిద. ప్రొద్దు పోలేదని ఇతరుల ఇండ్లకు పోకుండా తన ఇల్లు వదలనిదే ఆడది. పర పురుషులతో పండ్లికిలించేదే గాడిద. రామ నామ జపములో మునిగి పోవునదే ఆడది. ప్రేమికుల మాటలతో తియ్యదనమును గ్రోలునదే గాడిద. అన్న వస్త్రములు గలుగ గానే జన్మ రాహిత్యమునకు కృషి చేసేదే ఆడది. అట్లు గాక గర్వించి ఇతరులపై తప్పులు ఎంచుచూ కాలము వ్యర్థము చేయునది గాడిద.

గనుక నీవు గొప్ప పుణ్యాత్మురాలవు. నా ఆకలికి అన్నం వండుకునే ఏర్పాటు చేశావు. అంతియే గాక మోక్షము నొసంగు ఈ మహా మంత్ర రాజమును కంటితో జూచి, నోటితో ఉచ్ఛరించి, చేత్తో  వ్రాశావు. గనుక నీవు పరమ పవిత్రమైతివి. నీ శేషజీవితమున శ్రీహరిని కీర్తించి మోక్ష సామ్రాజ్యము పొందుము." అని చెప్పు సమయంబున అంతరిక్షము నుండి పుష్పక విమానములో విష్ణుదూతలరుదెంచిరి. "స్వామీ తమరినీ విమానములో పరమ పదంబునకు తీసుక రమ్మని శ్రీహరి పంపారు. గనుక దయ చేయు"డని ప్రార్థించిరి.

మాధవదాసు పెద్దలందరికి నమస్కరించి సెలవు తీసుకొని విమానమెక్కి వైకుంఠం చేరెను. అచ్చట వాసుదేవుండు మాధవదాసు గారిని ఆలింగన మొనర్చెను. మాధవదాసుగారు శ్రీహరికి పాదాభివందన మాచరించెను. అప్పుడు శ్రీహరి మాధవదాసు గారిని తిరిగి భూలోకంబున కేగి మద్రపట్టణంబున చిత్రసేన మహారాజును, ఆయన భార్య చిత్రవతిని శిష్యులుగా చేసుకొని తిరుమంత్రముపదేశించి రమ్మని తిరిగి భూలోకంబునకు పంపెను. మద్ర పట్టణంబున శ్రీహరి చెప్పిన కార్యము నిర్వహించి తిరిగి వైకుంఠ మరుదెంచెను.

ఇంతటి గొప్ప మహా మంత్ర రాజము దొరికిన వెంటనే పుష్పక విమానమొచ్చి శ్రీ మాధవదాసు గారిని వైకుంఠమునకు తీసుక వెళ్ళడం చూచాము. ఆ మహానీయుడు ఆ మంత్రాన్ని ఒక్క రోజైనా జపించలేదు గదా? ఇదే మనందరము అర్థం చేసుకోవలసినది. శ్రీ



మాధవదాసు గారు చిన్న నాటి నుండియు భగవద్స్మరణ తప్ప అన్యమే కోరని పుణ్యమూర్తి. ప్రారబ్ధవశాత్తు తన కనుభవం కావలసిన కష్టాలు తప్పలేదు. కష్టాలు వచ్చాయని తన గమ్యం మార్చు కోలేదు. ఋణాను బంధం కొద్దీ ఎక్కడెక్కడ తిరగాలో ఏమేమి తినాలో అదంతా అనుభవించి సద్గురుని చేరాడు. సద్గురుని చేరి వారి సంపూర్ణ కృప పొందేంతగా సేవించారు. తనకు గురుసేవ తప్ప అన్యమే ఎరుగని రీతిన సేవించారు. గురుసేవ తప్ప ఇతరంబేదియు వారి హృదయములో లేదు. ఋణానుబంధాలు తీరనిదే తానేమియూ చేయలేక గురువుగారు శ్రీ మాధవదాసు గారిని ఎరుకలసాని వద్ద ఋణానుబంధాలు తీరేందుకు పంపుతారు. ఆమె వద్ద గాడిదల మేపుచూ అన్యచింతలే ఎరుగక దైవ ధ్యానమే ఏకైక కర్తవ్యంగా జీవించాడు. గురు వాజ్ఞ ప్రకారము స్వయం పాకమునే తిని, భగవంతుడేమి ఇస్తే దానితోనే తృప్తి చెందాడు. ఋణానుబంధాలు తీరగానే ఏ మంత్ర సాధనలూ లేకుండానే కైవల్యము పొందాడు.

గనుక శ్రీ వెంకయ్య స్వామి వారు చెప్పిన మాట ఎంత గొప్ప సత్యమో ఇక్కడ తెలుస్తుంది. "మంత్ర మెక్కడుంది తంత్ర మెక్కడుంది చూచుకొంటూ పొయ్యేదే గదయ్యా " చూచు కుంటూ పోవడమంటే ఋణానుబంధాలు ఒక వైపు తీర్చుకుంటూ మరొక వైపు క్రొత్త ఋణానుబంధాలు చుట్టుకోకుండా జీవితం గడపడమే వారు చెప్పిన మాట కర్థము. ఆ మహనీయుడు ఆదేశించిన  పంచశీలసూత్రాన్ని ఆచరించడం అలవాటైతే సద్గురు కృప తప్పక కల్గుతుంది. అది మనం  శ్రీ మాధవదాసు గారి చరిత్రలో చూస్తాము.

ఇక్కడ మనకొక సందేహం కల్గడం సహజం. ఋణానుబంధాలు తీరడం సహజం. క్రొత్త ఋణానుబంధాలు తగిలించుకోకుండా  ఉండడం ఎట్లాగు? ఈ ప్రశ్నకు పూజ్య గురుదేవులు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారు చక్కని సమాధాన మిచ్చారు.

ఋణానుబంధం ఉందా లేదా అనేందుకు ఒకటే గుర్తు. ఏవ్యక్తితోనైన రాగ, ద్వేషాలు ఉంటే ఋణానుబంధమేర్పడ్డదని గుర్తు. ఎవరికి మనం సహాయము చేసినా, విధ్యుక్త ధర్మం నిర్వర్తిస్తున్నా  రాగద్వేషాలు లేకుండా చేస్తుండాలి. మనవారికి అనారోగ్యమై ఆస్పత్రిలో చేర్చాము. ఎంత డబ్బయినా ఖర్చుపెట్టవచ్చు గాని దుఃఖము ఉండకూడదు. దుఃఖము ఉంటే క్రొత్త బంధమేర్పడ్డట్టే అంటారు శ్రీ మాష్టరు గారు. ఈ సూత్రాన్ని గుర్తించుకొని జీవిత యాత్ర సాగిస్తుంటే మంత్రం తంత్రం లేకుండానే గురు కృప పొంది సంసార చక్రం నుండి తప్పక విడి పడుతాము. అలాగాక మంత్రోపదేశాలు తీసుకొని

నిరంతరం మంత్రం జపిస్తూ కూడా రాగద్వేషాలు వదల లేకుంటే మన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది.

ఈ విశ్వమంతా గురు రూపంగా భావించి, అన్ని జీవులలో శ్రీ వెంకయ్యస్వామి ఉన్నారని, ఏ జీవిని ఆదరించినా మన సద్గురుని ఆదరించినట్లేనని, ఏ జీవికి బాధ కల్గించినా మన సద్గురునికి బాధ కల్గించినట్లేననే నిరంతర ఎరుకతో రాగద్వేషాలకు వీలులేకుండా జీవించడం నేర్చుకోమని శ్రీస్వామివారు మహాసమాధి అనంతరం కూడా నిత్యసత్యులై బోధిస్తున్నారు.

జై సద్గురు రాయా



# మా యితర ప్రచురణలు

1. అవధూత లీల - శ్రీ వెంకయ్య స్వామి వారి జీవిత చరిత్ర — 40 రూ ||
2. అవధూత బోధామృతం - శ్రీ వారి బోధలు — 15 రూ ||
3. శ్రీ స్వామి సన్నిధి - శ్రీవారితో వారి సేవకుల అనుభవాలు — 15 రూ ||
4. అవధూత లీల (ఇంగ్లీషు) — 30 రూ ||
5. భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి (ఇంగ్లీషు) (చిన్నది) — 5 రూ ||
6. వార్తాలాపము — 150 రూ ||
7. అవధూత లీల (తమిళం) — 50 రూ ||
8. శ్రీ వెంకయ్య స్వామి (తమిళం) చిన్నది — 5 రూ ||
9. జ్ఞానేశ్వరి భగవద్గీత — 210 రూ ||
10. శ్రీ ధునీవాలా దాదా చరిత్ర — 15 రూ ||
11. శ్రీ వెంకయ్య స్వామి పూజ — 1 రూ ||
12. వెన్నెల పూలు - శ్రీ వెంకయ్య స్వామి దివ్యత్వం — 1 రూ ||
13. సాయి కృప - కలిచేడు భక్తుల అనుభవాలు. — 1 రూ ||
14. దివ్య లీలలు — 1 రూ ||
15. బోధయజ్ఞాయ నమః — 1 రూ ||
16. ధర్మమూర్తి — 1 రూ ||
17. పిలిచిన పలికే దైవం — 1 రూ ||
18. శ్రీ శివనేశన్ స్వామీజీ దివ్య చరితము. — 12 రూ ||
19. శ్రీ స్వామి కృప — 1 రూ ||
20. మౌన బోధ — 1 రూ ||
21. గురుస్తుతి — 7 రూ ||

## ఉచితము

1. మాస్టర్ గారి సత్సంగము
2. శ్రీ మాస్టారి మంచి మాట
3. శ్రీ భరద్వాజ గారితో భక్తుల అనుభవాలు
4. శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ చరిత్ర
5. మృత్యువుపై ఘన విజయము
6. మన ధర్మము - కర్తవ్యము
7. శ్రీశ్రీశ్రీ సుధీంద్ర బాబు గారు
8. స్మృతి మాత్ర ప్రసన్నాయ నమః
9. స్మృతి రహిత ప్రసన్నాయ నమః
10. సర్వ సమర్థుడు
11. అమృత వాక్కులు
12. శ్రీ రంగన్నబాబు దివ్య చరితము.
13. భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి (హిందీ)

ప్రతులకు వ్రాయండి:-
శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్టు,
గొలగమూడి,
నెల్లూరు జిల్లా 524 321